మానేరు **జనత** ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

27.10.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue): 187 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## భారత్, బంగ్లా పోరు రద్దు

రాణించిన రాధాయాదవ్.. 27 ఓవర్లలో 119/9



7

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# మూటల పంపకాల్లో ముఖ్యమంత్రి

## వాటాల కోసం మంత్రుల కొట్లాటలు

- జూబ్లీహిల్స్ ప్రజలారా.. ఆలోచించండి!
- ఓటుతో ద్రోహపూరిత పార్టీకి బుద్ధిచెప్పండి
- రెండేండ్లలో రాబందు ప్రభుత్వం పోతది
- మళ్లీ కేసీఆర్ రైతుబంధు రాజ్యం వస్తది
- మీకిచ్చిన హామీలను బీఆర్ఎస్ నెరవేరుస్తది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 'మహాలక్ష్మి' కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలె
- రేవంత్‌రెడ్డి లక్ష ఇండ్లు కూలగొట్టిండు: హరీశ్
- బీఆర్ఎస్‌లో చేరిన పలు యూనియన్ల నేతలు



'రాష్ట్రంలో కాంగ్రెస్ ముసుగులో రౌడీ పాలన నడుపుతున్నరు. ముఖ్యమంత్రి, మంత్రులు అలీబాబా దొంగల్లా, దండుపాళ్యం ముఠాల్లా తయారై దోపిడీ పర్వానికి తెరలేపారు. పాలనను గాలికొదిలి వాటాల కోసం కొట్టుకుంటున్నరు. పారిశ్రామికవేత్తల కణతలపై గన్నులు పెట్టి మూటల పంపకాల్లో మునిగితేలుతున్నరు' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి

## సీఎం రేవంత్

- రేపు యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సభ
- 30, 31న.. నవంబరు 4, 5 తేదీల్లో రోడ్‌షోలు!
- ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

.. వివరాలు 2లో



## ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు!

- అవసరమనుకున్న చోట ఇస్తాం
- ఒకే కుటుంబంలో ఇద్దరికి పదవులూ తప్పు కాదు
- సమన్వయ లోపంతోనే మంత్రుల మధ్య వివాదాలు
- కొండా సురేఖ కుమార్తె మాట్లాడిన విధానం ఆక్షేపణీయం
- కవిత యాత్రను స్వాగతిస్తున్నాం
- పదేళ్ల పాపపు పాలనలో ఆమె భాగస్వామ్యాన్ని ప్రశ్నిస్తున్నాం
- జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్సే
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

.. వివరాలు 2లో

## 21వ శతాబ్దం మనదే

- ఈ శతాబ్దం భారత్-ఆసియాన్‌కు చెందింది
- భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ మూల స్తంభం
- మనం గ్లోబల్ సౌత్లో భాగస్వాములం
- ఆసియాన్ సమ్మిట్ వర్చువల్ మీట్లో ప్రధాని మోడీ



**జనతా న్యూస్, న్యూఢిల్లీ :** 21వ శతాబ్దం మనది. అది భారత్–ఆసియాన్కు చెందినదిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మలేషియాలో ఆదివారం జరిగిన 22వ ఆసియాన్–ఇండియా సమ్మిట్లో వర్చువల్గా పాల్గొని ప్రసంగిస్తూ ప్రపంచ జనాభాలో దాదాపు ఒక నాలుగవ వంతు మనలో ఉంది. మనం భౌగోళికాన్ని మాత్రమే కాకుండా సంస్కృతి విలువలను కూడా పంచుకుంటా ము. మనం గ్లోబల్ సౌత్లో

మిగతా 4 లో

## బ్యాంకాక్ టు హైదరాబాద్ హైడ్రోపోనిక్ గంజాయి

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 4.15 కిలోలు స్వాధీనం
- 3 నెలల వ్యవధిలో రాష్ట్రంలో ఐదు కేసులు
- రూ.53 కోట్ల విలువైన 53 కిలోల గంజాయి సీజ్
- జూలైలో ఓ మహిళ వద్ద 40 కోట్ల సరుకు స్వాధీనం



2

## ఒక్కసారి కమిట్ అయితే.. నా మాట నేనే వినను

జాగృతి జనం బాటపై విమర్శలకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కౌంటర్



03

ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే విననని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆమె చేపట్టిన 'జాగృతి జనం బాట'పై వస్తున్న విమర్శలకు ఆదివారం నిజామాబాద్‌లో ఆమె కౌంటర్ ఇచ్చారు.

## వందేమాతరం చిరస్మరణీయం

- జాతీయ గీతానికి 150 ఏళ్లు
- దేశవ్యాప్తంగా వేడుకలు జరుపుకుందాం
- చరమాంకంలో నక్సలిజం
- జీఎస్టీ సంస్కరణలతో డబుల్ హ్యాపీనెస్
- మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ

4




## సింబల్ టెన్షన్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు
- కీలక దశకు చేరుకున్న ఉప ఎన్నిక ప్రక్రియ
- క్యాంపెయినింగ్‌ను ప్రయత్నాల్లో అభ్యర్థులు

2




జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. నామినేషన్ల విత్ డ్రా ముగియడం, బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నట్లు సంఖ్య తేలడంతో అభ్యర్థులకు ఈసీ తాజాగా ఎన్నికల సింబల్ కేటాయించింది. దీంతో అభ్యర్థులంతా క్యాంపెయినింగ్‌ను పరుగులు పెట్టించే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నారు.

## 8వ యుద్ధం ఆపేశా

- నోబెల్ శాంతి పురస్కారానికి మరో అర్హత
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య
- ట్రంప్ అధ్యక్షతన మలేషియా ప్రధాని మధ్యవర్తిత్వం
- కంబోడియా-థాయ్లాండ్ మధ్య శాంతి ఒప్పందం
- ఆసియాన్ వేదికగా జాయింట్ డిక్లరేషన్పై నేతల సంతకం
- మలేషియా, కంబోడియాతో ట్రంప్ ఒప్పందాలు

4






## రష్యా అమ్ములపొదిలో అణు క్రూయిజ్ క్షిపణి

- అణు శక్తితో అనంత దూరాలకు దూసుకెళ్లే బురే వెస్ట్నిక్
- పరీక్షలో 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణం
- ప్రపంచంలో మరే దేశం వద్దా ఇలాంటిది లేదన్న పుతిన్

4





## పాంగాంగ్ వద్ద చైనా బంకర్లు

- శాటిలైట్ చిత్రాల్లో వెల్లడి..
- ధ్రువీకరించిన నిఘా వర్గాలు
- వైమానిక రక్షణ కేంద్రంగా నిర్ధారణ
- ప్రయోగ కేంద్రాలు ఆయుధాల గోడౌన్లు, రాడార్ సైట్లు

4

## పాక్ ఉగ్ర జాబితాలో సల్మాన్‌ఖాన్!

- దుబాయ్ జాయ్ ఫోరంలో సల్మాన్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- బలూచిస్థాన్ను ప్రత్యేక దేశంగా పేర్కొనడంపై మండిపాటు
- అనుమానిత ఉగ్రవాదిగా పేర్కొంటూ నోటిఫికేషన్

4



# జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి సీఎం రేవంత్



**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న ఆయన.. స్వయంగా ప్రచారంలోకి దిగుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని యూస్‌ఫగూడ పోలీస‌గ్రౌండ్స్‌లో ఈ నెల 28న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, 24 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ జరగనుంది. ఆయనతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావునూ సన్మానించనున్నారు. ఆ సభలో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నట్లు సమాచారం. అలాగే ఈ నెల 30, 31 తేదీల్లోను మళ్లీ నవంబర్ 4, 5 తేదీల్లోనూ ఆయన రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీటికి మధ్యలో బిహార్ ఎన్నికల ప్రచారానికీ ఆయన వెళ్లనున్నట్లు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 22 నెలల పాలనకు ఈ ఉప ఎన్నిక కొలమానంగా మారడం, ఇక్కడ గెలిస్తే దాని ప్రభావం జీహెచ్‌ఎంసీ ఎన్నికలపైనా పడే అవకాశమున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

# బ్యాంకాక్ టు హైదరాబాద్ హైడ్రోపోనిక్ గంజాయి

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 4.15 కిలోలు స్వాధీనం**

**3 నెలల వ్యవధిలో రాష్ట్రంలో ఐదు కేసులు**

**రూ.53 కోట్ల విలువైన 53 కిలోల గంజాయి సీజ్**

**జూలైలో ఓ మహిళ వద్ద 40 కోట్ల సరుకు స్వాధీనం**

**మహిళలను కొరియర్లుగా వాడుతున్న ముఠాలు**



**హైదరాబాద్ :** హైడ్రోపోనిక్ గంజాయి.. మార్కెట్‌లోకి వచ్చిన కొత్త రకం గంజాయి. ఇటీవల కాలంలో విదేశాల నుంచి హైదరాబాద్‌కు అధికంగా రవాణా అవుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైడ్రోపోనిక్ గంజాయితో ప్రయాణికులు పట్టుబడుతున్న కేసులు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి శనివారం రాత్రి వరకు.. మూడు నెలల వ్యవధిలో హైడ్రోపోనిక్ గంజాయితో ఐదుగురిని శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.53.35 కోట్ల విలువైన 53.35 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రయాణికులంతా థాయ్‌లాండ్ నుంచి వచ్చిన వారు, మహిళలే కావడం గమనార్హం. శనివారం రాత్రి బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలికి చెందిన ట్రాలీ సూట్ కేసును తనిఖీ చేసిన డీఆర్‌ఐ అధికారులు 4.15కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రయాణికురాలిని అరెస్టు చేశారు. ఇక, వారం క్రితం బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద రూ.10 కోట్ల విలువైన 10 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. అంతకుముందు సెప్టెంబరు 5న బ్యాంకాక్ నుంచి వచ్చిన మరో మహిళ లగేజీలో రూ.13.9కోట్ల విలువైన 13.9కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక, సెప్టెంబరు 20న బ్యాంకాక్‌లో బయలుదేరి దుబాయ్ మీదుగా హైదరాబాద్ చేరుకున్న మరో మహిళ నుంచి 12 కోట్ల విలువైన 12 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది.

ఆగస్టు 11న బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ లగేజీలో రూ.13.3 కోట్ల విలువైన 13.3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి లభించింది. ఇలా మూడు నెలల వ్యవధిలో 53.35 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. అంతకముందు జూలైలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద ఏకంగా రూ.40 కోట్ల విలువైన 40కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలు అన్నింటిలో పట్టుబడిన వారంతా మహిళలే కావడం, అంతా బ్యాంకాక్ నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. బ్యాంకాక్ నుంచి వస్తున్న మహిళలను మత్తుమందుల స్మగ్లర్లు కొరియర్లుగా వాడుతున్నారని, అందుకే బ్యాంకాక్ నుంచి వస్తున్న మహిళా ప్రయాణికులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని డీఆర్‌ఐ అధికారులు చెబుతున్నారు. అయితే, డీఆర్‌ఐ నుంచి తప్పించుకునేందుకు స్మగ్లర్లు కొత్త ఎత్తులు వేస్తున్నారని తెలిపారు. కొరియర్లుగా వాడుతున్న మహిళలను బ్యాంకాక్ నుంచి నేరుగా కాకుం డా దుబాయ్ మీదుగా హైదరాబాద్‌కు పంపిస్తున్నారని చెప్పారు. కాగా, హైదరాబాద్ చేరుకున్న మహిళల దగ్గర నుంచి గంజాయిని తీసుకుని ముంబైకి తరలించడానికి మరో నెట్‌వర్క్ పనిచేస్తుందని, ఆ నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో ఉన్నామని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు తెలిపారు. 3 నెలల్లో హైడ్రోపోనిక్ గంజాయితో పట్టుబడిన మహిళల్లో నలుగురు ముంబైకి చెందిన వారని పేర్కొన్నారు.

**కిలో రూ.కోటి.. ఏమిటీ హైడ్రోపోనిక్ గంజాయి?**

ఒక గ్రాము రూ.10 వేలు.. ఒక కిలో రూ.కోటి.. ఇది హైడ్రోపోనిక్ గంజాయి ధర. ఎందుకింత రేటు అని అంటే.. సాధారణంగా గంజాయిని పొలాల్లో, మట్టి నేలల్లో పండిస్తారు. ఇందుకు భిన్నంగా హైడ్రోపోనిక్ గంజాయిని ప్రయోగశాలల్లో సాగు చేస్తారు. ప్రత్యేక ల్యాబ్‌ల్లో నియంత్రిత ఉష్ణోగ్రత, తేమల మధ్య పోషకాలను అందించి గంజాయిని సాగు చేస్తుంటారు. ఈ విధానాన్నే హైడ్రో పోనిక్స్ అంటా రు. 'మత్తు వదలరా' అనే సినిమాలో ఈ గంజాయి సాగు తీరును చూపిస్తారు. సాధారణ గంజాయి మొక్కలతో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయి మొక్కల ఎదుగుదల చాలా వేగంగా ఉంటుంది. పంట త్వర గా చేతికొస్తుంది. ఈ గంజాయి ఇచ్చే మత్తు కూడా అధికంగా ఉంటుంది. గంజాయిలోని టీహెచ్‌సీ– టెట్రాహైడ్రోకానబినాల్ మత్తును ఇస్తుంది. సాధారణ గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయిలో ఈ టీహెచ్‌సీ 30 శాతం అధికంగా ఉంటుంది. ఇక ఈ హైడ్రోపోనిక్ గంజాయితో హాష్ ఆయిల్, హాషిష్ కూడా తయారు చేస్తుంటారు. అధిక టీహెచ్‌సీ శాతం కలిగిన హైడ్రోపోనిక్ గంజాయి మొక్కల నుంచి తీయడం వల్ల ఈ హాష్ ఆయిల్, హాషిష్ ఇచ్చే మత్తు కూడా అధికంగానే ఉంటుంది.

# సింబల్ టెన్షన్

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక**

**బరిలో 58 మంది అభ్యర్థులు**

**కీలక దశకు చేరుకున్న ఉప ఎన్నిక ప్రక్రియ**

**క్యాంపెయినింగ్‌ను ప్రయత్నాల్లో అభ్యర్థులు**




**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. నామినేషన్ల విత్ డ్రా ముగియడం, బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నట్లు సంఖ్య తేలడంతో అభ్యర్థులకు ఈసీ తాజాగా ఎన్నికల సింబల్ కేటాయించింది. దీంతో అభ్యర్థులంతా క్యాంపెయినింగ్‌ను పరుగులు పెట్టించే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నారు. ఇక తమ సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోను గుర్తుల టెన్షన్ తప్పేలా లేదు. తాజాగా అభ్యర్థులకు ఈసీ ప్రకటించిన ఎన్నికల సింబల్స్ లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల గుర్తు కారును పోలిన సింబల్స్ మిగతా అభ్యర్థులకు కేటాయించడం బీఆర్‌ఎస్ ను టెన్షన్ పెట్టించే అంశంగా మారింది.

**మళ్లీ అవే గుర్తులు:**

తమ పార్టీ ఎన్నికల గుర్తు 'కారు'ను పోలిన గుర్తులు ఇతర అభ్యర్థులకు కేటాయించడం ద్వారా ఓటర్లు తికమక పడుతున్నారని, దీంతో ఓట్లు గల్లంతవుతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు చాలా కాలంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల్లో రోడ్డు రోలర్, చపాతీ మేకర్, సోప్ బాక్స్, ట్రాక్టర్, ఆటోరిక్షా, టీవీ, కుట్టుమిషన్, షిప్, డోలీ, కెమెరాతో సహా మరికొన్ని గుర్తులు కారు గుర్తుకు సమానంగా ఉన్నాయని వీటిని రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘాన్ని గతంలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధ ఓటర్లు, దృష్టిలోపం ఉన్న ఓటర్లు ఈ గుర్తుపై తికమక పడి చివరకు ఓటు వేస్తున్నారన్నారని పేర్కొంది. వాస్తవానికి గతంలో జరిగిన ఎన్నికల్లో ఇలాంటి సిబంల్స్ బీఆర్‌ఎస్ గెలుపును తారుమారు చేసిన చరిత్ర ఉంది. ఈక్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తాజాగా ఈసీ కేటాయించిన గుర్తుల్లో రోడ్డు రోలర్, చపాతీ మేకర్, కెమెరా, వంటి సింబల్స్ ఉండటంతో ఈసారి ఏం జరగబోతోందని అనేది ఇంట్రెస్టింగ్ గా మారింది.

**3వ నంబర్ కారు.. 9వ నంబర్ చపాతీ రోలర్:**

జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ కోసం ఈసీ కేటాయించిన బ్యాలెట్ పేపర్లో మొదటి స్థానంలో జాతీయ పార్టీ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి (కమలం), రెండో స్థానంలో మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ (చేయి), మూడో స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ (కారు) గుర్తులు కేటాయించారు. ఇక 5వ నంబర్ లో తెలుగు రాజాధికార సమితీ పార్టీ అభ్యర్థికి సోప్ డిష్, 9వ నంబర్లో అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థికి చపాతీ రోలర్, 13న నంబర్లో అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థికి రోడ్డు రోలర్, 21వ నంబర్లో ప్రజావెలుగు పార్టీ అభ్యర్థికి కెమెరా, 28వ నంబర్లో ఆల్ ఇండియా మజ్లిత్ ఈ– ఇన్ క్విలాబ్ ఈ మిలాత్ అభ్యర్థికి షిప్, 54వ నంబర్ లో ఇండిపెండెంట్ అభ్యర్థికి టీవీ వంటి గుర్తులు కేటాయించారు. అయితే సాధారణంగా పోలింగ్ కేంద్రంలో ఒక బ్యాలెట్ యూనిట్‌పై నోటా సహా 16 మంది పేర్లు, గుర్తు, ఫోటో ఉంటాయి. అంటే ఫస్ట్ ఈవీఎంలోనే బీఆర్‌ఎస్ తో సింబర్ కారుతో పాటు 5వ నంబర్ లో సోప్ డిష్, 9వ నంబర్ లో చపాతీ రోలర్, 13వ నంబర్ రోడ్డు రోలర్ సింబర్స్ ఉండనున్నాయి.

# ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు!

**అవసరమనుకున్న చోట ఇస్తాం**

**ఒకే కుటుంబంలో**

**ఇద్దరికి పదవులూ తప్పు కాదు**

**సమన్వయ లోపంతోనే**

**మంత్రుల మధ్య వివాదాలు**

**కొండా సురేఖ కుమార్తె మాట్లాడిన**

**విధానం ఆక్షేపణీయం**

**కవిత యాత్రను స్వాగతిస్తున్నాం**

**పదేళ్ల పాపపు పాలనలో ఆమె**

**భాగస్వామ్యాన్ని ప్రశ్నిస్తున్నాం**

**జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్సే**

**ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో**

**పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్**



**న్యూఢిల్లీ :** జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష (డీసీసీ) పదవులకు ఎమ్మెల్యేలకు కూడా పోటీ పడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. అయితే స్థానిక పరిస్థితులను బట్టి వారికి ఆ పదవులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇతర పదవుల్లో ఉన్నవారికి డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వబోమని చెప్పిన విషయం వాస్తవమేనని, కానీ.. ఆ పరిధిలోకి ఎమ్మెల్యేలు రారని అన్నారు. అన్ని అర్హతలు ఉన్నవారికే అవకాశం వస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో మీడియాతో మహేశ్‌గౌడ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ బలోపేతం కోసం అవసరమనుకున్న చోట ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తాం. వేరే పదవుల్లో ఉన్నవారైతే.. రాజీనామా చేయించి డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తాం. ఎమ్మెల్యేలకు డీసీసీ పదవులను డబుల్ పోస్టులుగా చూడటం లేదు. అలాగే, ఒకే కుటుంబంలో రెండు పదవులు తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ కోసమే కష్టపడేవాళ్లు ఒకే కుటుంబంలో ఉండొచ్చు. అలాంటప్పుడు వాళ్లకు పదవులు వద్దని ఎలా అంటాం? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి వంటి వాళ్ల ఇళ్లల్లో రెండు పదవులు వాళ్ల పనికి గుర్తింపుగా వచ్చినవే. ఉత్తమ్ పద్మావతి కూడా డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసినట్టు తెలిసింది. ఈసారి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. కొన్ని జిల్లాల్లో ఏఐసీసీ పరిశీలకులు ఇచ్చిన పేర్లే కాకుండా.. సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కతోపాటు నేను ఇచ్చిన పేర్లు వేరుగా ఉన్నాయి. అన్నింటినీ అధిష్ఠానం పరిశీలిస్తోంది. అవసరమనుకుంటే మళ్లీ నన్ను ఢిల్లీకి పిలవొచ్చు. లేదంటే.. వారం, పదిరోజుల్లో డీసీసీ అధ్యక్షుల పేర్లను అధిష్ఠానమే ప్రకటిస్తుంది" అని మహేశ్ గౌడ్ తెలిపారు.

**సమన్వయ లోపంతోనే వివాదాలు..**

మంత్రుల మధ్య సమన్వయ లోపంతోనే వివాదాలు వస్తున్నాయని మహేశ్‌గౌడ్ అభిప్రాయ పడ్డారు. "మంత్రి కొండా సురేఖ దగ్గర పనిచేసిన సుమంత్ ఒక ఇంట్లోకి వెళ్లాడు. ఆయనను వెంబడిస్తూ పోలీసులు వెళ్లారు. అది మంత్రి అధికారిక నివాసం కాదు. ఇంతలోనే సురేఖ కుమార్తె కిందికి వచ్చి పానిక్ అయి అలా మాట్లాడారు. ఎవరు, ఎవరినైనా కులం పేరుతో విమర్శిస్తే ఊరుకోం. ఆమెను మందలించాం. అసలు.. ఆమె కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు కాదు. పొన్నం ప్రభాకర్ విషయంలోనూ ఇటువంటిదే జరిగింది. ఇక జీవన్‌రెడ్డి శిష్యుడే అడ్లూరి లక్ష్మణ్. ఇవన్నీ.. సమన్వయలోపంతో వచ్చినవే. అన్నీ సద్దుమణిగాయి. కాంగ్రెస్ పార్టీలో ఓపికగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది. కాంగ్రెసలో కార్యకర్త నుంచి మంత్రి వరకు ఎవరైనా పార్టీ నియమాలకు లోబడే ఉండాలి. నాతో సహా అందరం హైకమాండ్ రాడార్‌లో ఉన్నాం" అని పీసీసీ చీఫ్ అన్నారు. మంత్రుల మధ్య వివాదం హరీశ్‌రావు, కేటీఆర్‌లకు కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టే అయ్యిందన్నారు. ముందుగా వారి కుటుంబంలోని పంచాయితీని సరిదిద్దుకోవాలని హితవు పలికారు. క్యాబినెట్ భేటీలో మంత్రుల పనితీరు, సమన్వయలోపం వంటి అంశాలన్నింటిపైనా సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారని తెలిపారు.

**కవిత పాదయాత్రను స్వాగతిస్తున్నాం**

ఎమ్మెల్సీ కవిత పాదయాత్రను స్వాగతిస్తున్నట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు. గత పదేళ్ల పాలనలోని అవినీతి గురించి కవిత చెప్పినవన్నీ నిజాలేనన్నారు. అయితే, కవిత సగం మాత్రమే నిజాలు చెప్పారని, మరో సగం చెప్పాల్సి ఉందని అన్నారు. అలాగే, గత పదేళ్ల పాపపు పాలనలో కవితకూ భాగస్వామ్యం ఉన్నందున ఆమెను ప్రశ్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలన్నారు. "రాముడి పేరుతో రాజకీయం చేయడం తప్పు.. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధికి ఏం చేశారు? జూబ్లీహిల్స్‌లోనూ బీజేపీ మతం పేరుతో రాజకీయం చేయాలని చూస్తోంది. పీజేఆర్ నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయం ఉండగా.. మళ్లీ ఇప్పుడు బండి సంజయ్ పెద్దమ్మ ఆలయం నిర్మిస్తాననడమేంటి? గుళ్లు, గోపురాలను బీజేపీ వాడుకుంటోంది. వేల ఏండ్ల కిందటే శ్రీరాముడు ఏలాడు. కానీ, దేశానికి స్వాతంత్ర్య వచ్చిన 40 ఏండ్లకు బీజేపీ పుట్టింది. అలాంటప్పుడు బీజేపీకి శ్రీరాముడితో ఏం సంబంధం? ఎవరెన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్ లో భారీ మెజార్టీతో గెలిచి తీరుతాం. మాగంటి కుటుంబ విషయాలు మీడియాలో చూసిన తర్వాతే మాకు తెలిసింది. అంతే తప్పు.. కేటీఆర్‌లా వేరేవాళ్ల కుటుంబాల్లోకి తొంగిచ్చూస అలవాటు మాకు లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీనే జూబ్లీహిల్స్‌లో ఓటు చోరీ చేసింది. ఓటు చోరీ గురించి తొలిసారి ఫిర్యాదు చేసిందే రేవంత్‌రెడ్డి" అని మహేశ్‌గౌడ్ అన్నారు.


**ఉద్యమ నేతగా కేసీఆర్ అంటే గౌరవమే...**

తెలంగాణ ఉద్యమ నేతగా కేసీఆర్ అంటే తనకెప్పుడూ గౌరవమేనని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆయనతోపాటు ఉద్యమంలో పాల్గొన్నామని, ప్రత్యేక తెలంగాణ సాధనకు పోరాడామని చెప్పారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనపైనే తమ అభ్యంతరమని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్ వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ఉదాసీనత వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందన్నారు. కాగా, ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో మహేశ్ గౌడ్ భేటీ అయ్యారు. 15 జిల్లాల్లో డీసీసీ అధ్యక్ష పదవులకు తీవ్ర పోటీ ఉన్నందున ఇరువురూ సమాలోచనలు చేసినట్టు సమాచారం.

# గన్ మెన్ మూర్తి ధైర్య సహసాలను ప్రదర్శించాడు

**అభినందించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి**

**కాల్పుల ఘటనపై డీజీపీ వాఖ్యలు**



హైదరాబాద్ : చాదర్ ఘాట్ కాల్పుల ఘటనలో డీసీపీ చైతన్య, గన్ మెన్ మూర్తి ధైర్య సహసాలను ప్రదర్శించారని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అభినందించారు. యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీసీపీ చైతన్య, గన్ మెన్ మూర్తిని ఆదివారం డీజీపీ పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ శనివారం చాదర్ ఘాట్ లో పోలీసులపై మొబైల్ స్నాచర్లు కత్తితో దాడికి ప్రయత్నించారని చెప్పారు. దొంగలను పట్టుకునేందుకు డీసీపీ చైతన్య, గన్ మెన్ మూర్తి 750 మీటర్లు వెంబడించి చేజ్ చేశారని తెలిపారు. నిందితుడు సయ్యద్ ఒమర్ అన్సారీపై 22 కేసులు ఉన్నాయని కాలా పత్తర్ పరిధిలో ఒమర్ అన్సారీపై రౌడీ షీట్ ఉందన్నారు. ఈ ఘటనలో గాయపడిన డీసీపీ చైతన్య, గన్ మెన్ మూర్తి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఇద్దరు అధికారులు నేడు డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్నారు. నిందితుడు అన్సారీకి బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగిందని ఇతని ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందని చెప్పారు. పోలీసు అధికారులు పరారీలో ఉన్న వారి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు.

# మూటల పంపకాల్లో ముఖ్యమంత్రి

**వాటాల కోసం మంత్రుల కొట్లాటలు**
**జూబ్లీహిల్స్ ప్రజలరా.. ఆలోచించండి!**
**ఓటుతో ద్రోహపూరిత పార్టీకి బుద్ధిచెప్పండి**
**రెండేండ్లలో రాబందు ప్రభుత్వం పోతది**
**మళ్లీ కేసీఆర్ రైతుబంధు రాజ్యం వస్తది**
**మీకిచ్చిన హామీలను బీఆర్ఎస్ నెరవేరుస్తది**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**'మహాలక్ష్మి' కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలె**
**రేవంత్‌రెడ్డి లక్ష ఇండ్లు కూలగొట్టిండు: హరీశ్**
**బీఆర్ఎస్‌లో చేరిన పలు యూనియన్ల నేతలు**



**హైదరాబాద్ :** 'రాష్ట్రంలో కాంగ్రెస్ ముసుగులో రౌడీ పాలన నడుపుతున్నరు. ముఖ్యమంత్రి, మంత్రులు అలీబాబా దొంగల్లా, దండుపాళ్యం ముఠాల్లా తయారై దోపిడీ పర్వానికి తెరలేపారు. పాలనను గాలికొదిలి వాటాల కోసం కొట్టుకుంటున్నరు. పారిశ్రామికవేత్తల కణతలపై గన్నులు పెట్టి మూటల పంపకాల్లో మునిగితేలుతున్నరు' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లిక్కర్ బాటిళ్లపై స్టిక్కర్ల కాంట్రాక్టు కోసం సీఎం రేవంత్ అల్లుడు, మంత్రి కొడుకు పోటీపడి ఓ సిన్సియర్ ఐఏఎస్ ఆఫీసర్‌ను బలిపశువు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి అన్నదమ్ములు, అనుచరులు కలిసి రాష్ట్రాన్ని పంచుకొని దోచుకుతింటున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరిట అర్రాస్‌పాట పాడి ఇప్పుడు నిధుల్లేవని సాకులు చెప్తూ తప్పించుకుంటున్నారని ధ్వజ మెత్తారు. కాంగ్రెస్ అంటేనే మోసాలకు కేరాఫ్ అని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వడ్డెర, హోటల్స్ రెస్టారెంట్స్ అండ్ బేకర్స్ కార్మిక యూనియన్ల నాయకులతో సమావేశమయ్యారు. వారితో మాట్లాడి సాధకబాధకాలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్న వర్గాలకు అండగా ఉంటామని అభయమిచ్చారు. కేసీఆర్ తిరిగి అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్, వడ్డెర సంఘం మహిళా నేత జయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ తాతామధు తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకుదెరువుకు హైదరాబాద్‌కు వచ్చిన చిన్నాచితక కార్మికులు కాంగ్రెస్ పాలనలో చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో నిశ్చింతగా బతుకులు వెళ్లదీసిన వారు రేవంత్ హయాంలో అరిగోసపడుతున్నారని పేర్కొన్నారు.

**మైనార్టీలకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యమేదీ?**

మైనార్టీ ప్రాతినిధ్యం లేని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోనే ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. ఆరుగురు ఎమ్మెల్సీలకు అవకాశం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఒక మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ఈ విషయాలపై రాహుల్‌గాంధీ మైనార్టీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణలో రేవంత్‌రెడ్డి, బీజేపీ నేతలు కలిసి పనిచేస్తున్నారు. ఇకడి కాంగ్రెస్ నేతలంతా బీజేపీతో కలిసిపోయారు. బీజేపీ ఎంపీలకు పిలిచి మరీ కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టులు ఇస్తున్నది. అలాంటి రెండు జాతీయ పార్టీలు దేశంలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలన్నింటిని బీ టీమ్‌లు అనడం సిగ్గుచేటు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హైడ్రా పేరిట ప్రతీకార రాజకీయాలు**

అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదని కేటీఆర్ ఉద్ఘాటించారు. ఓఆర్ఆర్ లోపల ఏ ఒక్క సీటు ఇవ్వకుండా నూటికి నూరుశాతం బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించారని గుర్తుచేశారు. కానీ పల్లె ప్రజలు హస్తంపార్టీ నేతల హామీలకు ఆశపడి ఓటేసిన పాపానికి ఇప్పుడు నరకం అనుభవిస్తున్నారని చెప్పారు. నగర ప్రజలు తమను నమ్మలేదనే కోపంతో కాంగ్రెస్ పాలకులు హైడ్రాను తెచ్చి ప్రతీకార రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. హైడ్రా పేరిట బుల్డోజర్లను తెచ్చి పేదల ఇండ్లను నేలమట్టం చేసి వారికి తీరని దుఃఖాన్ని మిగిల్చారని విమర్శించారు. హైడ్రా పెద్దోళ్లకు ఓ నిబంధనలు, పేదోళ్లకు వేరే నిబంధనలు పాటించడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు.

**మూడేండ్లలో వస్తాం.. హామీలు నెరవేరుస్తం**

రాష్ట్రంలో మరో మూడేండ్లలో రాబంధుల రాజ్యం పోయి కేసీఆర్ రైతుబంధు రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వడ్డెర సోదరులు, హోటళ్ల కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పారు. వడ్డెరులకు డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇప్పించేందుకు అసెంబ్లీలో, బయటా కొట్లాడుతామని పేర్కొన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇండ్లు ఇప్పిస్తామని, వారి పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక సీట్లు కేటాయిస్తామని భరోసాఇచ్చారు. అలాగే హోటళ్లు, బేకరీల యాజమానులు, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఓటింగ్‌లో పాల్గొని కారుకు ఓటేసి సారుకు అండగా నిలువాలని మరోసారి విజ్ఞప్తిచేశారు. జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలుపెట్టాల్సిన తరుణం ఆసన్నమైందని పునరుద్ఘాటించారు.

**పంపకాల్లో తేడాలతో మంత్రులు తన్నుకుంటున్నరు : హరీశ్‌రావు**

'వృద్ధులు, ఒంటరి మహిళల పింఛన్లు రూ. 4,000 వేలు కావాలన్నా.. మహాలక్ష్మి స్కీం కింద మహిళలకు రూ. 2,500 రావాల న్నా.. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడగొట్టాలి. ఓటుతో సీఎం రేవంత్‌రెడ్డి చెంపలు వాయించి బుద్ధిచెప్పాలి' అని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కారుకు ఓట్లు గుద్దితే రేవంత్‌రెడ్డి గూబ గుయ్యిమనాలని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం వడ్డెర సంఘం సమావేశానికి హాజరై మాట్లాడారు. మంత్రులకు మంత్రుల మధ్య, ముఖ్యమంత్రికి, మంత్రులకి మధ్య సమన్వయం కొరవడి పాలన కుంటుపడిందని విమర్శించారు. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో కొట్లాడుకుంటూ ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. మొన్న కొండా సురేఖ, నిన్న జూపల్లి వ్యవహారాలే కాంగ్రెస్ అరాచక విధానాలకు అద్దం పడుతున్నాయని దుయ్యబట్టారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ హవా

**నవీన్ యాదవ్ విజయం ఖాయం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**రహ్మత్‌నగర్‌లో ప్రచారం, బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి కౌంటర్**



**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా రహ్మత్ నగర్ డివిజన్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ హస్తం గుర్తు పై ఓటు వేసి జూబ్లీహిల్స్ అభివృద్ధికి అండగా నిలవాలని స్థానిక ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదవారికి అండగా ఉండే పార్టీ అని కొనియాడారు. సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇస్తే బీఆర్ఎస్ నేతలు పదేళ్లు దోచుకుతిన్నారు. బీఆర్ఎస్ దోపిడి భరించలేక ప్రజలు.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ హవా పెద్ద ఎత్తున కనిపిస్తుంది. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలవబోతున్నారు. పదేళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ మా అభ్యర్థి గురించి మాట్లాడారు అంటే మా విజయం అక్కడే అర్థం అవుతుంది. నిజంగా నవీన్ యాదవ్ రౌడీ అయితే పోయిన ప్రభుత్వంలో ఎన్ని కేసులు ఉన్నాయి బీఆర్ఎస్ నేతలు బయట పెట్టాలి. కావాలని మా అభ్యర్థిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారు. జూబ్లీహిల్స్ అంటే క్లాస్ పీపుల్ అని అందరూ అనుకుంటారు కానీ ఇది మాస్ ఏరియా. మాస్ ఏరియా వాళ్లకి అభివృద్ధి, సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీనే గుర్తు వస్తుంది. కంటోన్మెంట్స్ లో సెంటిమెంట్ వర్క్ అవుట్ అవలేదు ఇక్కడ కూడా కాదు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ ను జూబ్లిహిల్స్ ప్రజలు నమ్మే స్థితిలో లేరు. కచ్చితంగా యువకుడు అయినా మా అభ్యర్థి నవీన్ యాదవ్ ను ఇక్కడి ప్రజలు గెలిపిస్తారు. అని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటం

**42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం**
**బీసీ జేపీసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్**
**ఉద్యమ కార్యాచరణ, నవంబర్ 2న విస్తృత స్థాయి సమావేశం**



**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసి 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని బీసీ జేపీసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దీన్ని కోసం నవంబర్ 2న హైదరాబాద్ కళింగ భవన్ లో బీసీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాక్ వైస్ చైర్మన్ విజిఆర్ నారగోని, కో చైర్మన్ దాసు సురేష్, కో-కన్వీనర్ గుజ్జ కృష్ణలతో కలసి జాజుల మాట్లాడుతూ రాష్ట్రంలో రాస్తారోకోలు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైల్ రోకో లతో పాటు ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నాయకులను కలవనున్నట్లు తెలిపారు. చివరగా లక్షలాది మందితో హైదరాబాద్ ను దిగ్బంధం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 18న తలపెట్టిన బీసీ బంద్ పై అన్ని పార్టీలు బంద్ కు మద్దతు ఇచ్చాయని, కానీ బీసీ బంద్ ఎవరి కోసం అని కొంతమంది అగ్రకుల నాయకులు హేళన చేసే విధంగా మాట్లాడటంపై జాజుల మండిపడ్డారు. లక్ష్యాన్ని సాధించేంత వరకు అన్ని పార్టీలను, సంఘాలను కలుపుకొని వెళ్తామని చెప్పారు. ఎవరితో కుమ్మక్కై ప్రసక్తే లేదన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారానే 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమవుతుందని తెలిపారు. ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని ఒప్పించాలని కోరారు. ఎన్ని కేసులు, జైళ్లో పెట్టిన తమ గమ్యస్థానం చేరుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తామని జాజుల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు వేముల రామకృష్ణ, భాస్కర్, లింగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారి కమిట్ అయితే.. నా మాట నేనే వినను

**జాగృతి జనం బాటపై విమర్శలకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కౌంటర్**



**నిజామాబాద్, :** ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే విననని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆమె చేపట్టిన 'జాగృతి జనం బాట'పై వస్తున్న విమర్శలకు ఆదివారం నిజామాబాద్‌లో ఆమె కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మనం పెంచి పోషించిన నాయకులు మనల్నే విమర్శించడం రాజకీయాల్లో కొత్తమీ కాదని అన్నారు. చేసేది సద్విమర్శ కావాలని ప్రజల పక్షాన పోరాటం చేసే విమర్శ కావాలన్నారు. పర్సనల్‌గా ఎటాక్ చేస్తే ప్రజలు ఎవర్నీ కూడా క్షమించబోరని పేర్కొన్నారు.

**బీజేపీ ఎంపీలు రాజీనామాలు చేస్తేనే బీసీ రిజర్వేషన్లు.**

ప్రజల సమస్యలే తమ సమస్యలని వాటి కోసమే ప్రభుత్వంతో కొట్లాడుతున్నామని అన్నారు. ఆ దారిలోనే తాము జాగృతి జనం బాట కార్యక్రమాన్ని చేపట్టామని స్పష్టం చేశారు. తమ వెనుక చాలా మంది మొరుగుతుంటారని అవన్నీ పట్టించుకోవాల్సిన అవసరం లేదని కవిత అన్నారు. నేను ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే విననని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బోధన మాజీ ఎమ్మెల్యే షకీల్ తనకు సహరించలేదంటూ తానెక్కడ చెప్పలేదన్నారు. కానీ, తన సొంత నియోజకవర్గ పరిధిలోని నవీపేట్‌లో రైతులు నష్టపోతే కనీసం వారిని చూడదలేని, అదే షకీల్ నేడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. తన ఊరు కాబట్టే తాను జాగృతి జనం బాట కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాభించానని తెలిపారు. ఆదివారం నిజమాబాద్ రూరల్ నియోజకవర్గానికి వెళ్తున్నానని అక్కడ ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వివరించారు. పంట చేతికొచ్చే సమయానికి అటవీ శాఖ అధికారులు మందు చల్లి పంటను పూర్తి నాశనం చేయడం బాధకరమని అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో మొదలుపెట్టి మొత్తం 8 మంది బీజేపీ ఎంపీలు రాజీనామాలు చేస్తే దానంతట అవే బీసీ రిజర్వేషన్లు వస్తాయని కామెంట్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మైనారిటీలో ఉందని చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతుతోనే అంతా నడుస్తోందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ కోర్ మెంబర్ రాజీనామాలతోనే బీసీ రిజర్వేషన్లు సాధ్యమని కల్వకుంట్ల కవిత అన్నారు.

## కాంగ్రెస్ పాలన ఇంట్లో ఈగల మోతా బయట పల్లకిల మోతల

### విమర్శించిన మాజీ మంత్రి హరీశ్ రావు



**హైదరాబాద్ :** కాంగ్రెస్ పాలన ఇంట్లో ఈగల మోతా బయట పల్లకిల మోతల ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పంపకాల్లో తేడా వచ్చి మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో వడ్డెర సంఘం సమావేశానికి హాజరైన హరీష్ రావు ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ మొన్న కొండా సురేఖ కూతురు, నిన్న జూపల్లి కృష్ణారావు ఎలా మాట్లాడారో చూశామని, కేబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు బట్టలూడ తీసుకొని తిట్టుకున్నారట అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రజల గురించి చూడడం లేదని వాళ్ళు తన్నుకోడానికి, వాటాలు పంచుకోవడానికి సరిపోతోందని విమర్శించారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

**ఓటుతో రేవంత్ రెడ్డి బుద్ధి చెప్పాలి:**

కాంగ్రెస్ ప్రభుత్వం మొరం కొట్టుకునే తమపై అక్రమ కేసులు పెట్టి డబ్బులు వసూలు చేస్తోందని వడ్డెర సోదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో బిల్డింగ్‌లు నిర్మించే మీకు చేతినిండా పని దొరికేదన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తే, రేవంత్ రెడ్డి లక్ష ఇండ్లను కూలగొట్టారని విమర్శించారు. పేదల ఇండ్లు కూల్చొద్దన్న, హైడ్రా బంద్ కావాలన్నా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలన్నారు. ఇక్కడ కాగ్రెస్ గెలిస్తే హైదరాబాదులో ఇండ్లు కూల్చినా ప్రజలు నాకే ఓట్లేశారని రేవంత్ రెడ్డి విర్రవీగుతారని అందువల్ల కాంగ్రెస్ ను ఓడించాలన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలంటే ఈ ఉప ఎన్నికలో ఓటుతో రేవంత్ రెడ్డి బుద్ధి చెప్పాలన్నారు.

**రేవంత్ రెడ్డి కటింగ్ మాస్టర్:**

రేవంత్ రెడ్డి డబ్బు మూటలను, గుండాలను నమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో మీరు అడగకపోయినా హైదరాబాద్‌లో వడ్డెర సంఘానికి కేసీఆర్ ఎకరం భూమి ఇచ్చారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అంటే కటింగ్ మాస్టర్. రేవంత్ రెడ్డి ఎక్కడా కొత్త స్కీమ్ పెట్టింది లేదు కొత్త భవనం కట్టింది లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ కట్టిన ఫ్లైఓవర్లకు, బిల్డింగ్‌లకు రిబ్బన్లు కట్ చేసుడు, కేసీఆర్ పెట్టిన స్కీములను కోతలు పెడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కిట్, బతుకమ్మ చీర, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ అన్ని పథకాలకు కత్తెర పెట్టారని విమర్శించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవులకు, కురుమలకు ఆత్మగౌరవ భవనాలను హైదరాబాద్‌లో నిర్మించామని, రేవంత్ రెడ్డి ఒక రూపాయి అయినా బీసీల ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు ఇచ్చావా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ ప్రారంభించిన బీసీ ఆత్మగౌరవ భవనాలకు నిధులు విడుదల చేసి పనులను పూర్తి చేయాలన్నారు. భర్త చనిపోతే ఏడ్చిన ఆడపడుచుని కాంగ్రెస్ నాయకులు అవహేళన చేశారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహిల్స్ లో మాగంటి సునీతమ్మ భర్తను కోల్పోయి చిన్నపిల్లలు ఉన్నారు. గోపీనాథ్ చనిపోతే ఆ కుటుంబాన్ని అనాథలుగా వదిలేయమంటారా? అని ప్రశ్నించారు.

# రష్యా అమ్ములపొదిలో అణు క్రూయిజ్ క్షిపణి

**అణు శక్తితో అనంత దూరాలకు దూసుకెళ్లే బురే వెస్నిక్**

**పరీక్షలో 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణం**

**ప్రపంచంలో మరే దేశం వద్దా ఇలాంటిది లేదన్న పుతిన్**



**మాస్కో:** ప్రపంచంలోనే తొలిసారిగా.. అణు శక్తితో దూసుకెళ్లే క్రూయిజ్ క్షిపణిని రష్యా పరీక్షించింది! ప్రపంచంలో ఏ మూలనున్న లక్ష్యాన్నైనా ఛేదించే (అన్‌లిమిటెడ్ రేంజ్) సత్తా ఉన్న ఆ క్షిపణి పేరు.. '9ఎం730 బురే వెస్ట్నిక్'. ఈ క్షిపణిని లాంచ్ చేయడానికి సంప్రదాయ ఇంజిన్‌నే వాడతారు. అనంతరం అందులోని చిన్న అణు రియాక్టర్ ఉత్తేజితమై.. దానికి 'దాదాపు అనంత దూరం' ప్రయాణించే శక్తినిస్తుంది! దీని తుది పరీక్షను ఆదివారం విజయవంతంగా నిర్వహించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. "ప్రపంచంలో మరెవరి వద్దా లేని అద్భుతమైన సృష్టి ఇది" అని ఆయన సగర్వంగా పేర్కొన్నారు. ఈ క్షిపణిని రష్యా సాయుధ దళాల అమ్ములపొదిలో చేర్చేందుకు అవసరమైన మౌలిక సదు-పాయాలను కల్పించాలని సైనికాధికారులను ఆదేశించారు. పరీక్షల్లో భాగంగా అక్టోబరు 21న బురేవెస్ట్నిక్‌ను ప్రయోగించగా.. అది 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా దూరం ప్రయాణించిందని రష్యా మిలటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వెలెరీ గెరాసిమోవ్ తెలిపారు. 14 వేల కిలోమీటర్లు దాని గరిష్ఠ పరిధి కాదని.. బురేవెస్ట్నిక్ సాంకేతిక సామర్థ్యాలు ఎంత గొప్పవంటే ప్రపంచంలో ఎంత దూరంలో, ఎంత సురక్షిత ప్రదేశంలో ఉన్న లక్ష్యాన్నైనా అది గురితప్పకుండా ఛేదించగలదని ఆయన వివరించారు. రష్యా వద్ద ఇప్పటివరకూ ఉన్న క్రూయిజ్ క్షిపణుల్లో అత్యధిక రేంజ్ కలిగినది.. కేహెచ్-102 క్రూయిజ్ మిస్సైల్. దాని పరిధి 4500 కిలోమీటర్లు అంటే.. బురేవెస్ట్నిక్ సత్తా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అణు ఇంధనంతో నడిచే శక్తి, వార్‌హెడ్ సామర్థ్యాలను కలిగిన ఈ క్షిపణి గురించి పుతిన్ 2018లోనే ప్రపంచానికి తొలిసారి తెలియజేశారు. బురేవెస్ట్నిక్‌ను ఆయన అజేయమైన ఆయుధంగా అభివర్ణించారు. 50 నుంచి 100 మీటర్ల ఎత్తులో ప్రయాణించే ఈ క్రూయిజ్ క్షిపణిని గుర్తించి, అడ్డుకోవడం అత్యంత అధునాతనమైన క్షిపణి నిరోధక రక్షణ వ్యవస్థలకు సైతం చాలా కష్టమని వివరించారు.

**పరీక్షల్లో ప్రమాదాలు..**

ఈ క్షిపణిని అభివృద్ధి చేసి, పరీక్షించే క్రమంలో రష్యన్ శాస్త్రవేత్తలకు పలు సాంకేతిక సవాళ్లు ఎదురయ్యాయి. 2016 నుంచి ఈ క్షిపణిని పదిసార్లకు పైగా పరీక్షించారు. 2019 ఆగస్టులో నెనోక్సా వద్ద నిర్వహించిన రికవరీ ఆపరేషన్ (అంటే క్షిపణి పరీక్ష అనంతరం దాని భాగాలను సేకరించే) సమయంలో పేలుడు సంభవించి ఏడుగురు శాస్త్రజ్ఞులు చనిపోయారు. సెవరోడ్‌విన్స్క్ ప్రాంతంలో రేడియేషన్ స్థాయులు పెరిగాయి. ఆ తర్వాత 2021, 2022, 2023లో దీన్ని పలుమార్లు పరీక్షించారు. ఇప్పటికే రష్యా వద్ద ఉన్న పొసెయ్‌డాన్ అణు టార్పెడోతో ఇది కూడా కలిస్తే.. ఆ దేశ సెకండ్ స్ట్రైక్ క్యాపబిలిటీస్ పెరుగుతాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. రష్యా భూభాగంలోని ఏ బేస్ నుంచి ప్రయోగించినా అది అమెరికాలోని ఏ లక్ష్యాన్నైనా చేరుకోగలదని 'ద ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎసఎస్)' తెలిపింది.

# పాంగాంగ్ వద్ద చైనా బంకర్లు

**శాటిలైట్ చిత్రాల్లో వెల్లడి.. ధ్రువీకరించిన నిఘా వర్గాలు**




**న్యూఢిల్లీ:** భారత సరిహద్దుకు సమీపంలో చైనా కొత్త వైమానిక రక్షణ సముదాయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. 2020లో ఇరుదేశాల మధ్య ఘర్షణకు వేదికైన పాంగాంగ్ సరస్సుకు తూర్పు వైపున 110 కిమీ. దూరంలో ఈ నిర్మాణాలు చేపట్టినట్లు శాటిలైట్ చిత్రాల్లో వెల్లడైంది. ఈ మేరకు భారతదేశనిఘా వర్గాలు తాజా నివేదికలో వెల్లడించాయి. ఉపగ్రహ ఛాయా చిత్రాలలో క్షిపణి లాంచర్ సైట్లు కనిపిస్తున్నాయి. భారత్కు వ్యతిరేకంగా తన వైమానిక వ్యవస్థను బలోపేతం చేయడానికి చైనా చేస్తున్న కొత్త ప్రయత్నంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ నిర్మాణాల వల్ల వాస్తవ నియంత్రణ రేఖ నుంచి కేవలం 65 కి.మీ. దూరంలో ఉన్న భారతదేశపు నైమా ఎయిర్ ఫీల్డ్‌కు ముప్పు పొంచివుందని నిఘా వర్గాలు వెల్లడిం చాయి. చైనా గార్ కౌంటీలో కొత్త వైమానిక రక్షణ కేంద్రం నిర్మిస్తున్నట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికా కంపెనీ ఆల్‌సోర్స్ అనాలిసిస్ పరిశోధకులు ఈ నిర్మాణాలను తొలుత గుర్తించారు. ఇక్కడ కమాండ్ కంట్రోల్ భవనం, బ్యార క్లు, వాహన షెడ్లు, ఆయుధాల గోడౌన్, రాడార్ సైట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇవి ట్రాన్స్‌పోర్టర్ ఎరెక్టర్ లాంచర్ వాహనాల కోసం స్లైడ్జింగ్ రూఫ్లతో కప్పిన క్షిపణి ప్రయోగ స్థానాలుగా యూఎస్ పరిశోధకులు విశ్లేషించారు. అలాగే ఈ బంకర్లు క్షిపణులను రహస్యంగా దాచివుంచేందుకు రూపొందించినవిగా నిఘా వర్గాలు భావిస్తున్నాయి. పాంగాంగ్కు తూర్పు అంచున కూడా ఇలాంటి సముదాయం నిర్మిస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. వాస్తవానికి పాంగాంగ్ కాంప్లెక్స్ ప్రారంభ నిర్మాణాన్ని జులై ఆఖరులోనే జియోస్పేషియల్ పరిశోధకుడు డామియన్ సైమన్ గుర్తించారు. కానీ ఆసమయంలో క్షిపణి బంకర్లు వెలికిరాలేదు.

# వందేమాతరం చిరస్మరణీయం

**జాతీయ గీతానికి 150 ఏళ్లు**

**దేశవ్యాప్తంగా వేడుకలు జరుపుకుందాం**

**చరమాంకంలో నక్సలిజం**

**జీఎస్టీ సంస్కరణలతో డబుల్ హ్యాపీనెస్**

**మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ**

**న్యూఢిల్లీ:** వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు జరుపుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశారు. తన నెలవారీ మన్ కీ బాత్ రేడియో ప్రసంగంలో ఆదివారం మాట్లాడుతూ భారతదేశపు శక్తివంతమైన, అద్భుతమైన ప్రతిరూపాన్ని వందేమాతరం జాతీయ గీతం చిత్రీకరిస్తుందని, భవిష్యత్ తరాల కోసం దాని విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా 150వ సంవత్సరాన్ని చిరస్మరణీయంగా మార్చాలని పిలుపునిచ్చారు. 1896లో బంకించంద్ర చటోపాధ్యాయ రాసిన, రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారి పాడిన జాతీయ గీతం 150 ఏళ్ల జ్ఞాపకార్థం దేశవ్యాప్తంగా వందేమాతరంకు సంబంధించిన అనేక కార్యక్రమాలు జరుగుతాయని ఆయన అన్నారు. 30 నిమిషాల ప్రసం గంలో, గుజరాత్లో మడ అడవులను పునరుద్ధరించే ప్రయ త్నాలు, ఛత్తీస్ గఢ్ లో చెత్త కేఫ్లను ఏర్పాటు చేయడం, బెంగ ళూరులో సరస్సులను పునరుద్ధరించే ప్రయత్నాలు వంటి దేశం లోని వివిధ ప్రాంతాలలో పౌరులు చేపట్టిన అనేక ప్రత్యేక కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు.

**సాయుధ బలగాల్లో స్వదేశీ జాగిలాలు**

భారతీయ శునక జాతులను తమ యూనిట్లలో చేర్చుకోవ డానికి పారామిలిటరీ దళాలు చేసిన కృషిని ప్రధాని ప్రశంసిం చారు. ఇటీవల జరిగిన పోటీలో విదేశీ జాతుల కుక్కలను తోసిరాజని " స్వదేశీ ముధోల్ హౌండ్ జాగిలం అవార్డులు గెలుచుకుందని తెలిపారు. గత సంవత్సరం, ఛత్తీస్ గఢ్ లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో గస్తీ తిరుగుతున్నప్పు డు, సీఆర్పీఎఫ్కు చెందిన ఒక స్వదేశీ జాగిలం 8 కిలోల పేలుడు పదార్థాలను కనుగొంది అని మోడీ అన్నారు. వీటిలో కొన్ని అక్టోబర్ 31న సర్దార్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని గుజరాత్లోని ఏక్తా నగర్లో నిర్వహించే కవాతులో పాల్గొంటాయని ఆయన అన్నారు.

**సంస్కృతాన్ని బోధిస్తున్న సోషల్ మీడియా**

సామాజిక మాధ్యమాల ప్రపంచం సంస్కృతానికి కొత్త జీవితాన్ని ఇచ్చిందని, చాలా మంది యువకులు రీల్స్ ద్వారా సంస్కృతంలో దాని గురించి మాట్లాడుతున్నారని ప్రధాన మంత్రి అన్నారు. చాలామంది తమ సోషల్ మీడియా ఛానెల్స్ ద్వారా సంస్కృతాన్ని కూడా బోధిస్తారు. అలాంటి యువ కంటెంట్ సృష్టికర్త భాయ్ యష్ సలుంకే. యష్ ప్రత్యేకత ఏమిటంటే అతను కంటెంట్ సృష్టికర్త, క్రికెటర్. సంస్కృతంలో మాట్లాడుతూ క్రికెట్ ఆడటంపై అతని రీల్ చాలా ప్రజాదరణ పొందింది అని మోడీ అన్నారు.

**కొమురం భీమ్ స్ఫూర్తి**

తెలంగాణ గిరిజన యోధుడు కుమురం భీమ్ను స్మరించు కుంటూ 20 ఏళ్ల వయసులోనే అన్యాయానికి వ్యతిరేకంగా కొమురం భీమ్ తిరుగుబాటు చేశాడు. నిజాం పాలనలో రైతుల ధాన్యం లాగేస్తున్న సిద్ధికీ అనే అధికారిని ఎదిరించా డు. అతడితో పోరాడాడు. చివరకు సిద్ధికీని మట్టుపెట్టాడు. కొమురం భీమ్ ఆచూకీ కోసం నిజాంసైనికులు అస్సాం వరకు వెళ్లారు. ఆ ధైర్యం, ఆత్యాగం... ఇవాళ కూడా మన యువత కు స్ఫూర్తి అని ప్రధాని పేర్కొన్నారు.

**జీఎస్టీ సంస్కరణలతో సంతోషం దిగ్గుణం**

జీఎస్టీ సంస్కరణలపై ఎక్స్ లో చేసిన పోస్టులో జీఎస్టీ సంస్కరణలు సమాజం లోని అన్ని వర్గాలకు సంతోషాన్ని తీసు కొచ్చాయి. సమాజంలోని ప్రతి వర్గానికి రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి, వ్యాపారులు లేదా ఎంఎస్ఎంఈలకు నేరుగా ప్రయోజనాలను అందిసా బియి. ఇది దేశవ్యాప్తంగా జీఎస్టీబచత్ ఉత్సవ్ ను ప్రారంభిస్తుం ది. మనం కొనుగోలు చేసేది స్వదేశీ అని, మనం అమ్మేది స్వదేశీ అని గర్వంగా చెప్పాలి. నవ రాత్రి, తదితర పండుగలు మంచి ఆరోగ్యం, సంతోషం శ్రేయ-స్సును ప్రజలకు తీసుకొస్తా యని కోరుకుం టున్నాను అని మోడీ పేర్కొన్నారు.

**అంతం వైపు నక్సలిజం**

నక్సలిజం వంటి సమస్యలపై మా ప్రభుత్వం చేస్తున్న పోరాటం గురించి కూడా మాట్లాడాలి. మన దేశంలో నక్సలి జం బలహీనపడుతోంది. మనం దాన్ని పూర్తిగా అంతం చేయడానికి దగ్గర్లో ఉన్నాము. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్య సేవల ద్వారా మేము ఈ సమస్యను మూలాల వద్ద నిర్మూలించాలని కృషి చేస్తున్నాము. ఈ ప్రయత్నాల్లో గ్రామీణ ప్రజల సహకారం కీలకం. మనం కలిసి పనిచేస్తే, మన దేశాన్ని మరింత సురక్షితంగా, సమృద్ధంగా చేయవచ్చు అని ప్రధాని తెలిపారు.

# 21వ శతాబ్దం మనదే




మొదటి పేజీ తరువాయి

భాగస్వాములం. వాణిజ్య భాగస్వాములం మాత్రమే కాదు, సాంస్కృతిక భాగస్వా ములం కూడా అని అన్నారు. మా యాక్ట్ ఈస్ట్ పాలసీకి మూలస్తంభంగా ఆసియాన్ ఉంది. ఆసియాన్ కేంద్రీకరణను, దాని దృక్పథాన్ని భారత్ సమర్థిస్తుంది. ఈ సంవత్సరం ఆసియాన్ సమ్మిట్ శీర్షిక అయిన సమ్మిళిత త్వం, నిలకడతత్వంలో డిజిటల్ సమ్మిళిత త్వం, ఆహార భద్రత, ప్రస్తుత అశాంతి ప్రపంచంలో స్థిరమైన సరఫరా గొలుసుల కోసం మన ఉమ్మడి ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి అని మోడీ తెలి పారు. మేము కలిసి పని చేయడానికి కట్టుబడి ఉన్నా ము. ఎలాంటి విపత్తులోనైనా ఆసియాన్ స్నేహితులకు అండగా భారత్ నిలబడింది అని ప్రధాని చెప్పారు.

ఆసియాన్-ఇండియా మెరిటైమ్ సహకార సంవత్సరంగా 2026

బ్లూ ఎకానమీ లేదా సముద్ర భద్రతలో మన సహకారం వేగంగా పెరుగుతోందని ఆసియాన్ సమ్మిట్ను ఉద్దేశించి మోడీ అన్నారు. దీనిని చూసిమేము 2026 ను ఆసియా న్-ఇండియా మెరిటైమ్ కోఆపరేషన్ ఇయర్ గా ప్రకటిస్తు న్నాము అని తెలిపారు. మన సాం స్కృతిక వారస త్వాన్ని కాపాడటానికి, ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి మనం కలిసి పని చేస్తూ ఉంటాము. 21వ శతాబ్దం మనది. భారత్-ఆసియాన్కు చెందిన ది. ఆసి యాన్ కమ్యూనిటీ విజన్-2045, వికసిత భారత్-2047 లక్ష్యాలు మొత్తం మానవాళికి ప్రకాశవం తమైన భవిష్య త్తును నిర్మిస్తాయని నేను నమ్ముతున్నాను అని సుమారు 6 నిమిషాల ప్రసంగాన్ని ముగిస్తూ ప్రధాని అన్నారు.

# 8వ యుద్ధం ఆపేశా




**నోబెల్ శాంతి పురస్కారానికి మరో అర్హత**

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య**

**ట్రంప్ అధ్యక్షతన మలేషియా ప్రధాని మధ్యవర్తిత్వం**

**కంబోడియా-థాయ్లాండ్ మధ్య శాంతి ఒప్పందం**

**మలేషియా, కంబోడియాతో ట్రంప్ ఒప్పందాలు**

**కౌలాలంపూర్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలో థాయ్లాండ్, కంబోడియా దేశాలు చారిత్రక శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. మలేషియా రాజధాని కౌలాలంపూర్లో జరుగుతున్న 47వ అసోసియే షన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్(ఆసియాన్) సమ్మిట్లో థాయ్లాండ్ ప్రధాని అనుటిన్ చార్న్విరాకుల్, కంబోడియా ప్రధాని హ న్ మానెట్ కౌలాలంపూర్ శాంతి ఒప్పందాలు పేరుతో చారిత్రక శాంతి ఒప్పందపై సంతకాలు చేశారు. థాయ్లాండ్ ప్రధాని అనుటిన్ చార్న్విరాకుల్ కంబోడియా ప్రధాని హన్ మానెట్ అనే మేము మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జె. ట్రంప్ సమక్షంలో మా దేశాల మధ్య శాంతి, సుస్థితర, సహకారాన్ని ప్రోత్సహించడానికి ఈ జాయింట్ డిక్లరేషన్పై సంతకం చేస్తున్నాము అని ఒప్పందంలో ఇరువురు పేర్కొన్నారు.

**నోబెల్ పురస్కారానికి మరొక అర్హత**

ట్రంప్ మాట్లాడుతూ ఇది చారిత్రక శాంతి ఒప్పందం. థాయ్లాండ్, కంబోడియా నాయకులు ధైర్యవంతులు. మేము ఇది చేయలేమని చాలామంది చెప్పారు. కానీ మేము చేశాము. ఇది లక్షలాది మంది జీవితాలను కాపాడింది. ఈ ఒప్పందంతో నేను ఎనిమిది యుద్ధాలను ముగించినట్ట య్యింది. నోబెల్ శాంతి పురస్కారాన్ని దక్కించుకోవడంలో మరొక అర్హతను ఇది నాకు తెచ్చి పెట్టింది అని అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా రెండో పదవీ కాలంలో పీస్మేకర్గా తనను తాను ప్రదర్శించుకోవడానికి ఈ మధ్యవర్తిత్వం ట్రంప్ చేశారు. ఈ నేపథ్యంలో నోబెల్ పీస్ ప్రైజ్కు ట్రంప్ పేరును కంబోడియా నామినేట్ చేశారు. ఒప్పందాన్ని దీర్ఘకాలిక శాంతికి పునాదిగా థాయ్లాండ్ వర్ణించారు.

**ఒప్పందం ముఖ్యాంశాలు**

◆ సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని కాపాడటానికి సరిహద్దు పరిశీలక బృందాలు ఏర్పాటు. ◆ రెండు దేశాల మధ్య సహకారం పెంచడం, వివాదాలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించడం. 6 అమెరికా-మలేషియా మధ్యవర్తి త్వంతో భవిష్యత్తులో వాణిజ్యం, రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడం.

రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక బోర్డర్ వివాదాన్ని పరిష్కరిం చడానికి, శాంతి, సహకారాన్ని ప్రోత్సహిం చడానికి ఈ ఒప్పం దం దారితీస్తుంది. ఆసియా ప్రాంతం లో సుస్థిరతను పెంచు తుంది. ఇది చైనా ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికాకు వ్యూహాత్మకంగా సహాయపడు తుంది. జూలై, 2025లో ఇరుదేశాల మధ్య జరిగిన తీవ్రమైన సరిహద్దు యుద్ధం 43 మంది మరణాలకు కారణ మైంది. 1962 నుంచి ప్రీహ్ విహార్ ఆలయానికి సంబం ధించి థాయ్లాండ్-కంబోడియా మధ్య సరిహద్దు వివా దం ఉంది. ఈ సమ్మిట్లో మలేషియాతో మినరల్స్ ఒప్పం దం, కంబోడియాతో వాణిజ్య ఒప్పందా లను ట్రంప్ కుదు-ర్చుకున్నారు.

# పాక్ ఉగ్ర జాబితాలో సల్మాన్ ఖాన్!

**దుబాయ్ జాయ్ ఫోరంలో సల్మాన్ వ్యాఖ్యలపై ఆగ్రహం**

**బలూచిస్థానన్ను ప్రత్యేక దేశంగా పేర్కొనడంపై మండిపాటు**

**అనుమానిత ఉగ్రవాదిగా పేర్కొంటూ నోటిఫికేషన్**



అబుదాబి: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖానన్ను పాకిస్థాన్ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇటీవల బలూచిస్థాన్ గురించి అతను చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించిన దాయాది దేశం, సల్మాన్పై ఉగ్రవాద ముద్రవేసింది. పాక్ ఉగ్రవాద నిరోధక చట్టం (1977)లోని నాల్గవ షెడ్యూల్ కింద సల్మాన్ ఖాన్ పేరును చేర్చినట్లు సమాచారం. ఈ షెడ్యూల్ ఉగ్రవాదంతో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తుల జాబితాకు సంబంధించినది. ఈ చర్యతో బాలీవుడ్ నటుడి కదలికల్ని పాక్లో పరిమితం చేస్తారని, ఆయనపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజాగా రియాద్లో జరిగిన జాయ్ ఫోరం 2025 లో సల్మాన్ చేసిన వ్యాఖ్యలు పాకన్ను చిర్రెత్తించాయి. షారూఖ్, అమీరాఖాన్తో కలిసి జాయ్ ఫోరంలో సల్మానాన్ పాల్గొన్నారు. ఈ వేదికపై హిందీ సినిమాల గురించి మాట్లాడుతూ, బలూచిస్థానన్ను ప్రత్యేకదేశంగా పేర్కొన్నారు. హిందీ సినిమాను సౌదీలో విడుదల చేస్తే సూపర్ హిట్ అవుతుంది. అలాగే తమిళ, తెలుగు లేదా మలయాళసినిమాను విడుదల చేస్తే అది కూడా వందల కోట్ల కలెక్షన్లు వసూలు చేస్తుంది. ఎందుకంటే అన్నిదేశాల ప్రజలు ఇక్కడ ఉన్నారు. అలాగే బలూచ్ ప్రజలు, పాక్ ప్రజలు, అఫ్గాన్ ప్రజలు కూడా ఇక్కడ నివశిస్తున్నారు అని వ్యాఖ్యానించారు. సల్మాన్ కామెంట్ పాక్లో కలకలం రేపింది. అనంతర పరిణామాలతో షెహబాజ్ ప్రభుత్వం బాలీవుడ్ నటుడిపై ఉగ్రవాద ముద్ర వేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# తేనె, దాల్చిన చెక్క పొడి కలిపి రోజూ తినండి..

ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..



తేనెను మనం తరచూ తీసుకుంటూనే ఉంటాం. దీన్ని పలు పానీయాల్లో కలిపి తాగుతుంటాం. అలాగే తీపి పదార్థాల తయారీలోనూ తేనెను ఉపయోగిస్తుంటారు. ఇక దాల్చిన చెక్కను కూడా మనం వంటల్లో వేస్తూనే ఉంటాం. మసాలా వంటకాల్లో దాల్చిన చెక్కను వాడుతాం. దీన్ని నేరుగా అలాగే వంటల్లో వేస్తారు. లేదా పొడిగా చేసి కూడా వంటల్లో వేస్తుంటారు. దాల్చిన చెక్కను వేయడం వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన, రంగు వస్తాయి. అయితే తేనె, దాల్చిన చెక్క మిశ్రమం మనకు ఎన్నో లాభాలను అందిస్తుంది. ఒక టీస్పూన్ తేనెలో పావు టీస్పూన్ దాల్చిన చెక్క పొడి కలిపి రోజుకు 2 లేదా 3 సార్లు తీసుకోవాలి. దీని వల్ల పలు అనారోగ్య సమస్యలను నయం చేసుకోవచ్చు. ఆయుర్వేద ప్రకారం ఈ రెండింటి మిశ్రమం చక్కని ఔషధంగా పనిచేస్తుంది. ఇది మనకు అనేక లాభాలను అందిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

తేనె, దాల్చిన చెక్క మిశ్రమంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ మిశ్రమం యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. రెండింటిలోనూ పాలిఫినాల్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**రోగ నిరోధక శక్తికి..**

తేనె, దాల్చిన చెక్క మిశ్రమాన్ని రోజూ తింటుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు, ముక్క దిబ్బడ నుంచి ఉపశమరం లభిస్తుంది. ఈ మిశ్రమంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా దగ్గు, గొంతు సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది. తేనె, దాల్చిన చెక్క మిశ్రమం గాయాలు, పుండ్లను మాన్చడంలోనూ అద్భుతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానుతాయి. మొటిమలు తగ్గిపోతాయి. పలు రకాల చర్మ ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి.

**కీళ్ల నొప్పులు, వాపులకు..**

తేనె, దాల్చిన చెక్క మిశ్రమం అలర్జీలు ఉన్నవారికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే అలర్జీలు తగ్గిపోతాయి. అలాగే ఈ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి కనుక దీన్ని రోజూ తింటే కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, మలబద్దకం నుంచి సైతం బయట పడవచ్చు. ఇలా ఈ మిశ్రమం మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతుంది.




# షుగర్ లెవల్స్‌ను అద్భుతంగా తగ్గించే ఆయుర్వేద చిట్కాలు.. రోజూ వీటిని పాటించండి..!

టైప్ 2 డయాబెటిస్ సమస్య ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రస్తుతం చాలా మందికి టైప్ 2 డయాబెటిస్ వస్తోంది. ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే షుగర్ వచ్చేది. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులో ఉన్నవారు కూడా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అధికంగా బరువు ఉండడం, శారీరక శ్రమ చేయకపోవడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉండడం, రోజూ గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, ఆహారం అతిగా తినడం, నిద్రలేమి వంటి అనేక కారణాల వల్ల టైప్ 2 డయాబెటిస్ వస్తోంది. ఈ వ్యాధి వచ్చిన వారు డాక్టర్ సూచన మేరకు క్రమం తప్పకుండా మందులను వాడాల్సి ఉంటుంది. అలాగే సరైన జీవనశైలిని పాటించాలి. దీంతో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. అయితే టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి పలు ఆయుర్వేద చిట్కాలు కూడా ఎంతగానో పనిచేస్తాయి.

**కాకరకాయ, దాల్చిన చెక్క..**

టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు కాకరకాయను రోజూ తినాల్సి ఉంటుంది. షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో కాకరకాయ అద్భుతంగా పనిచేస్తుంది. అయితే దీన్ని రోజూ తినాలంటే ఇబ్బందిగా ఉంటుంది. కనుక దీన్ని జ్యూస్ లేదా ట్యాబ్లెట్లు, పొడి రూపంలో తీసుకోవచ్చు. ఇలా తీసుకున్నా కూడా మేలు జరుగుతుంది. కాకరకాయ జ్యూస్ అయితే రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి 30 నిమిషాల ముందు 30 ఎంఎల్ మోతాదులో తాగాల్సి ఉంటుంది. కాకర కాయ ట్యాబ్లెట్లను ఆయుర్వేద వైద్యుల సూచన మేరకు రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు 1 లేదా 2 వేసుకోవచ్చు. లేదా కాకరకాయ పొడిని నీటిలో కలిపి కూగా తాగవచ్చు. ఇలా ఈ చిట్కాను పాటిస్తుంటే షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. అలాగే వంటల్లో వాడే దాల్చిన చెక్కను తింటున్నా కూడా షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. ఇందుకు గాను దాల్చిన చెక్క వేసి మరిగించిన నీళ్లను రోజూ తాగాలి. లేదా దాల్చిన చెక్క పొడిని కూడా ఆహారాలపై చల్లి తినవచ్చు. ఇలా చేస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది.

**మెంతులు, ఉసిరికాయ..**

షుగర్‌ను తగ్గించడంలో మెంతులు కూడా బాగానే పనిచేస్తాయి. నిత్యం ఉదయాన్నే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో 1 టీస్పూన్ మెంతుల పొడిని కలుపుకుని తాగితే డయాబెటిస్ తగ్గుతుంది. లేదా 1 టేబుల్ స్పూన్ మెంతులను రాత్రంతా నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయాన్నే వాటిని తినాలి. అనంతరం వాటిని నానబెట్టిన నీటిని తాగాలి. ఇలా రోజూ చేస్తున్నా కూడా షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. అదేవిధంగా నిత్యం ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో ఉసిరికాయ రసం తాగాలి. లేదా పూటకు రెండు లేదా మూడు ఉసిరికాయలను అలాగే తినవచ్చు. ఉసిరికాయల నుంచి తీసిన పదార్థాలతో చేసిన ట్యాబ్లెట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని కూడా డాక్టర్ సూచన మేరకు వాడుకోవచ్చు. దీని వల్ల షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

**తిప్పతీగ, రాగి నీళ్లు..**

షుగర్‌ను తగ్గించేందుకు తిప్పతీగ కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఈ మొక్క మన చుట్టూ పరిసరాల్లో పెరుగుతుంది. ఈ మొక్క ఆకుల నుంచి రసం తీసి తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. తిప్పతీగ రసం మనకు మార్కెట్‌లో మందుల షాపుల్లోనూ లభిస్తుంది. తిప్పతీగ రసం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అలాగే రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీళ్లను రోజూ తాగడం వల్ల కూడా షుగర్‌ను తగ్గించుకోవచ్చు. రాత్రంతా రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీళ్లను ఒక గ్లాస్ మోతాదులో మరుసటి రోజు ఉదయం పరగడుపునే తాగుతుండాలి. ఇలా రోజూ చేస్తుంటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఈ విధంగా ఆయా ఆయుర్వేద చిట్కాలను రోజూ పాటిస్తుంటే టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది.


# మన శరీరంలో జింక్ లోపిస్తే కనిపిస్తే లక్షణాలు ఇవే..

## ఈ ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుంది..!

మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అవసరం అయ్యే అనేక పోషకాల్లో జింక్ కూడా ఒకటి అనే విషయం అందరికీ తెలిసిందే. జింక్ మినరల్స్ జాబితాకు చెందుతుంది. ఇది మన శరీరంలో అనేక జీవక్రియలు సరిగ్గా నిర్వహించేందుకు సహాయం చేస్తుంది. జింక్ మనకు అనేక రకాల ఆహారాల ద్వారా లభిస్తుంది. వృక్ష సంబంధ లేదా జంతు సంబంధ ఆహారాలు వేటిని తీసుకున్నా సరే జింక్‌ను పొందవచ్చు. జింక్ వల్ల మన శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అలాగే జింక్ వల్ల చర్మం సురక్షితంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. గాయాలు, పుండ్లు త్వరగా మానాలంటే కూడా జింక్ అవసరం అవుతుంది. జింక్ ఉన్న ఆహారాలను తీసుకుంటే వాపులు సైతం తగ్గిపోతాయి. ఇలా జింక్ మనకు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది.

**వీటిని తీసుకోవాలి..**

తృణ ధాన్యాలను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే ఫైబర్ అధికంగా లభిస్తుంది. అలాగే జింక్ ను కూడా వీటి ద్వారా పొందవచ్చు. గోధుమలు, బ్రౌన్ రైస్, కినోవా, ఓట్స్ వంటి ఆహారాలను రోజూ తింటుంటే జింక్ సులభంగా లభిస్తుంది. అలాగే పాలు లేదా పాల ఉత్పత్తులను తీసుకోవడం వల్ల కూడా దీన్ని పొందవచ్చు. పాలు, చీజ్, పెరుగు, నెయ్యి తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటి ద్వారా కేవలం జింక్ మాత్రమే కాకుండా క్యాల్షియంను కూడా పొందవచ్చు. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, పల్లీలు, అవిసె గింజలు, గుమ్మడి విత్తనాలు, నువ్వులు, చియా సీడ్స్, పొద్దు తిరుగుడు




విత్తనాలను తినడం వల్ల కూడా జింక్ సమృద్ధిగా లభిస్తుంది. ఈ గింజలు లేదా విత్తనాలను రోజూ గుప్పెడు మోతాదులో తీసుకుని నీటిలో నానబెట్టి తింటుంటే ఉపయోగం ఉంటుంది. అదేవిధంగా ఆలుగడ్డలు, బీన్స్, బ్రోకలీ, పుట్ట గొడుగులు, వెల్లుల్లి, ఉల్లిపాయలను రోజూ తింటున్నా కూడా జింక్‌ను పొందవచ్చు.

**జింక్ లోపిస్తే కనిపించే లక్షణాలు..**

ఇక మన శరీరంలో జింక్ లోపం ఉంటే పలు లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్లుండి సడెన్‌గా బరువు తగ్గుతారు. గాయాలు, పుండ్లు మానడం ఆలస్యం అవుతుంది. అప్రమత్తంగా ఉండలేకపోతుంటారు. బద్ధకంగా అనిపిస్తుంది. రుచి, వాసన చూసే శక్తిని కోల్పోతారు. విరేచనాలు అవుతుంటాయి. ఆకలిగా ఉండు. ఆహారం తినాలనిపించదు. చర్మంపై ఉండే రంధ్రాలు తెరుచుకుని చర్మం అంద విహీనంగా కనిపిస్తుంది. ఇలా జింక్ లోపం ఉంటే మన శరీరం మనకు ఆయా లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. జింక్ లోపం ఉన్నవారు సాధారణంగా ఆయా ఆహారాలను తీసుకుంటే ఈ లోపం నుంచి సులభంగా బయట పడవచ్చు. అలాగే వైద్యులు పరీక్షలు చేసి మందులను సైతం ఇస్తారు. వాటిని కూడా క్రమం తప్పకుండా వాడుతున్నా ఉపయోగం ఉంటుంది.

**ఎవరెవరికి ఎంత జింక్ అవసరం..**

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం పురుషులకు రోజుకు 11 మిల్లీగ్రాముల వరకు జింక్ అవసరం అవుతుంది. అదే స్త్రీలకు అయితే రోజుకు 8 మిల్లీగ్రాముల వరకు జింక్ కావల్సి ఉంటుంది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు రోజుకు 12 మిల్లీగ్రాముల వరకు జింక్ లభించేలా చూసుకోవాలి. జింక్ లోపిస్తే సాధారణంగా ఆహారాలను తీసుకుంటుంటే సరిపోతుంది. కానీ వైద్య చికిత్స ద్వారా ఈ లోపాన్ని అధిగమిస్తే మేలు జరుగుతుంది. దీని వల్ల మళ్లీ ఈ లోపం రాకుండా చూసుకోవచ్చు. అయితే సమతుల ఆహారాన్ని రోజూ తీసుకుంటే జింక్ మాత్రమే కాదు, అసలు పోషకాహార లోపమే రాకుండా చూసుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# భారత్, బంగ్లా పోరు రద్దు

## రాణించిన రాధాయాదవ్.. 27 ఓవర్లలో 119/9



ముంబై: ప్రతిష్టాత్మక మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీని వరుణుడు నీడలా వెంటాడుతూనే ఉన్నాడు. ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు దక్కించుకున్న భారత్..తమ ఆఖరి పోరులో బంగ్లాదేశ్‌తో ఆదివారం తలపడ్డ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. వర్షం అంతరాయంతో నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా%ొ%రాధా యాదవ్(3/30) ధాటికి 27 ఓవర్లలో 119/9 స్కోరుకు పరిమితమైంది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ తన లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్‌తో రాధా..బంగ్లా పతనంలో కీలకమైంది. రాధా స్పిన్ ఉచ్చులో చిక్కుకున్న బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమైంది. షమీమ్ అక్తర్(36), షోబన మోస్త్రె(26) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. శ్రీచరణి(2/23) రెండు వికెట్లతో ఆకట్టుకుంది.

లక్ష్యఛేదనకు దిగిన టీమ్‌ఇండియా వర్షం అంతరాయం కల్గించే సమయానికి 8.4 ఓవర్లలో 57 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మందన(34 నాటౌట్), అమన్‌జ్యోత్‌కౌర్(15 నాటౌట్) రాణించారు. లక్ష్యం సాఫీగా సాగుతున్న సమయంలో వరుణుడు ఎడతెరిపిలేకుండా కురువడంతో మైదానం మొత్తం చిత్తడిగా మారింది. ముఖ్యంగా స్కేర్ ప్రాంతంలో మైదానం తడిగా ఉండటంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆడిన 7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 3 ఓటములు, ఒక రద్దుతో 7 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలువగా, ఆస్ట్రేలియా(13), ఇంగ్లండ్(11), దక్షిణాఫ్రికా(10) టాప్-3లో ఉన్నాయి.



**ప్రతీకకు గాయం:**

తొలిసారి వన్డే వరల్డ్‌కప్ టైటిల్ గెలుపే లక్ష్యంగా ముందుకెళుతున్న టీమ్‌ఇండియాకు ప్రతీకా రావల్ రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. బంగ్లాతో మ్యాచ్ 21వ ఓవర్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ప్రతీక కాలి మడమకు తీవ్ర గాయమైంది. నొప్పితో విలవిలలాడిన ప్రతీకకు సహాయక సిబ్బంది తోడుగా నిలిచారు. గాయంతో సరిగ్గా నడవలేకపోయిన ప్రతీక కుంటుకుంటూ మైదానాన్ని వీడింది. ఈనెల 30న ఆస్ట్రేలియాతో కీలకమైన సెమీస్ నాటికి ప్రతీక అందుబాటులో ఉంటుందా లేదా అన్న దానిపై అస్పష్టత నెలకొన్నది. ఒక వేళ అప్పటికీ పూర్తి స్థాయిలో కోలుకోపోతే టీమ్‌ఇండియా విజయావకాశాలపై ప్రభావం చూపించనుంది.

**ఇంగ్లండ్‌దే గెలుపు:**

న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి పోరులో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట కివీస్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. ప్లిమ్మర్ (43), అమెలియా కెర్(35) ఆకట్టుకున్నారు. ఆ తర్వాత లక్ష్యాన్ని ఇంగ్లండ్ 29.2 ఓవర్లలో 172/2 స్కోరు చేసింది. అమీ జోన్స్(86 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించింది. డివైన్, తుహుహు ఒక్కో వికెట్ తీశారు.

# 90 ఓవర్లలో ఖతం..

## అస్సాం, సర్వీసెస్ మ్యాచ్‌లో కొత్త ఫీట్

### ఒకే పోరులో రెండు హ్యాట్రిక్‌లు.. కొత్త రికార్డులు నమోదు



గువాహటి: దేశవాళీ టోర్నీ రంజీల్లో రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రంజీ పోరులో భాగంగా సర్వీసెస్, అస్సాం మధ్య మ్యాచ్ పలు రికార్డులకు వేదికైంది. ఈ రెండు జట్ల పోరు 90 ఓవర్లలోనే పూర్తి అయ్యింది. సుదీర్ఘ రంజీ చరిత్రలో ఇది కొత్త రికార్డుగా నమోదైంది. ఓవర్‌నైట్ స్కోరు 56/5తో రెండో రోజు ఆదివారం ఇన్నింగ్స్‌కు దిగిన అస్సాం 75 పరుగులకే కుప్పకూలింది.

అర్జున్ శర్మ(4/20), అమిత్‌శుక్లా(3/6) అస్సాం పతనాన్ని శాసించారు. 71 పరుగుల లక్ష్యాన్ని సర్వీసెస్ 13.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. రవి చౌహాన్(20 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలువగా, రియాన్ పరాగ్(2/31)రెండు వికెట్లు తీశాడు. ఇదే మ్యాచ్‌లో ఇద్దరు బౌలర్లు అర్జున్‌శర్మ, మోహిత్ జంగ్రా హ్యాట్రిక్ ఫీట్ నమోదు చేశారు. రంజీల్లో ఒకే పోరులో రెండు హ్యాట్రిక్‌లు నమోదు కావడం ఇదే తొలిసారి.

**హైదరాబాద్ 435**

పుదుచ్చేరితో జరుగుతున్న రంజీ గ్రూపు-డీ పోరులో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 435 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రాహుల్‌సింగ్(114) సెంచరీతో కదంతొక్కగా, రాహుల్ రాదేశ్(81), హిమతేజ(66), తన్మయ్(50) అర్ధసెంచరీలతో రాణించారు. ఉదేశి(4/110) నాలుగు వికెట్లు తీశాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పుదుచ్చేరి వికెట్ కోల్పోయి 25 పరుగులు చేసింది.

# రన్నరప్ దేవిక




జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ దేవికా సిహాగ్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో దేవిక 11-21, 9-21తో మాజీ ప్రపంచ చాంపియన్ నజోమి ఒకుహర(జపాన్) చేతిలో ఓటమిపాలైంది.

గత ఆగస్టులో మలేషియా ఇంటర్నేషనల్ చాలెంజ్ టైటిల్ గెలిచిన ఈ 20 ఏండ్ల యువ షట్లర్ ఫైనల్లో సత్తాచాటలేకపోయింది. ఇదే టోర్నీలో పుయి చీ వా, లీ సో యుయి , ఇషికా జైస్వాల్‌పై అద్భుత విజయాలు సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

# ఫైనల్లో సుజిత్.. అండర్-23 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

నోవీ సాద్(సెర్బియా): ప్రతిష్టాత్మక అండర్-23 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు తమ సత్తాచాటుతున్నారు. భారత టాప్ రెజ్లర్లలో ఒకడిగా కొనసాగుతున్న సుజిత్ కల్కాల్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన పురుషుల 65కిలోల సెమీస్ బౌట్‌లో సుజిత్ 3-2తో యుటో నిశుషిపై అద్భుత విజయం సాధించాడు. బౌట్ మరికొన్ని క్షణాల్లో ముగుస్తుందనగా సుజిత్ పట్టు విజయం వైపు నిలిపింది. అప్పటి వరకు 1-2తో వెనుకంజలో ఉన్న సుజిత్.. బౌట్ పూర్తి కావడానికి మూడు సెకన్ల దూరంలో లెగ్ అటాక్‌తో జపాన్ రెజ్లర్‌ను కట్టిపడేశాడు. ఈ టోర్నీలో అంతకుముందు జరిగిన వేర్వేరు బౌట్లలోనూ ఈ యువ రెజ్లర్ ఫిదోర్ కెవాద్రి(12-2), డొమినిక్ జాకబ్(11-0)తో అలవోక విజయాలు సాధించాడు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ప్రపంచ టైటిల్ గెలువని సుజిత్ ఖాతాలో రెండు అండర్-23 ఏషియన్ టైటిళ్లతో పాటు అండర్-20 ఏషియన్ చాంపియన్‌షిప్ స్వర్ణం ఉంది. మరోవైపు శుభమ్(61కి), అశిష్(86కి), వికీ(97కి) ప్రత్యర్థుల చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.





# పీవీఎల్ చాంప్ బెంగళూరు.. ఫైనల్లో ముంబైపై విజయం

ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్) నాలుగో సీజన్‌లో బెంగళూరు టార్పెడోస్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్లో బెంగళూరు 15-13, 16-14, 15-13తో ముంబై మీటియర్స్‌పై అద్భుత విజయం సాధించింది. మ్యాచ్ ఆద్యంతం తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన బెంగళూరు వరుస సెట్లలో ముంబైని చిత్తుగా ఓడించింది. దీంతో పీవీఎల్ నాలుగో సీజన్‌లో బెంగళూరు రూపంలో కొత్త చాంపియన్ అవతరించింది. తొలి సీజన్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్, రెండో సీజన్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్, మూడో సీజన్‌లో కాలికట్ హీరోస్ టైటిళ్లు దక్కించుకున్నాయి.

తుది పోరు విషయానికొస్తే.. బెంగళూరు తరఫున పీటర్ ఒస్టిక్ బ్లాక్‌లకు తోడు జోయెల్ బెంజిమెన్ స్పైక్‌లతో ముంబైని సమర్థంగా నిలువరించారు. శుభమ్ చౌదరి స్పైక్‌లను జిష్ణు బ్లాక్ చేయడంతో బెంగళూరు శిబిరంలో ఉత్సాహం నెలకొంది. అనవసర తప్పిదాలు ముంబైని ఓటమి వైపు నిలిపాయి. మూడో సెట్‌లో జులెన్ పెన్రోస్ బెంగళూరు జట్టులో చేరడంతో మెరుపు స్పైక్‌లతో కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఆఖర్లో నిఖిల్ సర్వీస్ తప్పిదంతో బెంగళూరు టైటిల్ విజేతగా నిలిచింది.

# బ్రూక్ బాదినా.. కివీస్ చేతిలో ఇంగ్లండ్ ఓటమి

మౌంట్ మౌంగనుయి: ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచి 1-0తో ముందంజ వేసింది. తొలుత కెప్టెన్ హ్యారీ బ్రూక్(101 బంతుల్లో 135, 9ఫోర్లు, 11 సిక్స్‌లు) వీరొచిత సెంచరీతో ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 పరుగులకు పరిమితమైంది. నాలుగు పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన బ్రూక్..కివీస్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. తన దూకుడైన బ్యాటింగ్‌తో 9 ఫోర్లు, 11 భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. బ్రూక్ తర్వాత జెమీ ఓవర్టన్(46)దే టాప్ స్కోర్ కాగా మిగతావారు సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. ఫౌల్క్స్ (4/41), డఫీ (3/55) ఇంగ్లండ్ పతనంలో కీలకమయ్యారు. నిర్దేశిత లక్ష్యాన్ని కివీస్ 36.4 ఓవర్లలో 224/6 స్కోరు చేసింది. డారిల్ మిచెల్ (78 నాటౌట్), మిచెల్ బ్రేస్‌వెల్(51) అర్ధసెంచరీల కివీస్‌ను గెలిపించారు. బ్రైడన్ కార్స్ (3/45) మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు.



# ఎమ్మెల్యే కవ్వంపల్లిపై రసమయి ఫిర్యాదు



## నోటీస్‌కి సమాధానమిచ్చిన రసమయి

## ఇప్పటికైనా మారాలని కవ్వంపల్లికి హితవు

## లేదంటే ప్రజలతో గుణపాఠం తప్పదని హెచ్చరిక

తిమ్మాపూర్, జనతా న్యూస్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్ కి ఆదివారం ఫిర్యాదు చేశారు. గత నెలలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల ఎదుట తనను బూతులు తిట్టిన విషయమై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పై ఫిర్యాదు చేసినట్లు రసమయి తెలిపారు. ఎల్ఎండి పోలీస్ స్టేషన్ కి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేరుకొని ఆయనపై నమోదైన కేసుకు సంబంధించిన సమాధానంను తిమ్మాపూర్ రూరల్ సీఐ సదన్ కుమార్ కు అందజేశారు.

న్యాయవాది, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావుతో కలిసివచ్చి ఆయన సిఐ కి సమాధానం అందించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణని బూతులు తిడుతూ ఆయన వాట్సాప్ కు రసమయి బాలకిషన్ పంపిన వాయిస్ ని పోలీసులకు అందించి కవ్వంపల్లి సత్యనారాయణ ఈనెల 14 తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన ఎల్ఎండి పోలీసులు రసమయి బాలకిషన్ కి ఈనెల 23న నోటీసులు అందించారు. తాను అందుకున్న నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ఆదివారం ఉదయం రసమయి బాలకిషన్ ఎల్ఎండి పోలీస్ స్టేషన్కు రాగా ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అనుచరులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వీరు వస్తున్న విషయాన్ని ముందుగానే గమనించిన పోలీసులు ఎల్ఎండి పోలీస్ స్టేషన్ వద్ద భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మీడియాతో మాట్లాడారు.

అభివృద్ధి చేయడం చేతగాకే...కవ్వంపల్లి కాంగ్రెస్ చెడ్డి గ్యాంగ్ తో దాడులు చేయిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనను దూషించిన విషయమై కేసు నమోదు చేయాలని సీఐ ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు తో కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

2014,2018 అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గము ఉద్యమకారుడినైనా తనను ఎమ్మెల్యే గా పట్టం కట్టిన గడ్డనీ అన్నారు. గత పదేళ్ళలో మానకొండూర్ నియోజకవర్గము అభివృద్ధి, ప్రగతి సాధించినాదని తెలిపారు. ఇప్పుడు మానకొండూర్ నియోజకవర్గము పేరు చెప్పితే తెలంగాణ ప్రజలు ఉలిక్కిపడి పోతున్నారని, రాష్ట్ర ప్రజలు ఛీకొడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిరాధారమైన ఆరోపణలతో కేసులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీరూ చూస్తుంటే దొంగనే దొంగ అన్నట్టు ఉందన్నారు. గత సెప్టెంబర్ 28 తేదీ రోజు జర్నలిస్టుల సాక్షిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనని దుర్భాశలాడినారని అన్నారు. ఎవరు ఎలాంటివాళ్లో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలకు తెలుసు అన్నారు. నా తల్లిని, భార్యను, పిల్లలను తిట్టడం బాధించినదని, తన కలర్ ను కూడా ఎమ్మెల్యే దూషించాడని రసమయి తెలిపారు. గిసొంటి సంస్కారం లేని ఎమ్మెల్యే విజ్ఞతకే వదిలేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరువు పోతుందని నేను అమెరికా పోయిన తర్వాత నేను ఆయనను తిట్టినట్లు వీడియో తయారు చేసి పోలీస్ స్టేషన్ లో అక్రమ కేసు పెట్టించారని ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గములో బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నాడనీ అన్నారు. ఎమ్మెల్యే సంస్కారం ఎందో ఇప్పుడు ప్రజలకు తెలుస్తున్నదని, లారీ కింద పడి చనిపోయిన సురేష్ గౌడ్ ను కూడా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎందుకు తిట్టినారని,

ఎమ్మెల్యే నీచమైన మాటలు మాట్లాడినారని అన్నారు.

వార్తలు రాసే జర్నలిస్టులను కూడా ఎమ్మెల్యే తిట్టినారని,

ఎమ్మెల్యే కవ్వంపల్లి సారథ్యంలో అతడి చెడ్డి గ్యాంగ్ దాడులకు తెగబడుతుందని అన్నారు. నా ఇంటిపై దాడి చేసి ఇంట్లో ఉన్న మనుషులపై హత్యాయత్నం చేశారని తెలిపారు. మెల్యే కవ్వంపల్లి చేసిన అభివృద్ధి పై దమ్ముంటే చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కు సంస్కారం ఉంటే పాత్రికేయుల సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉల్టా కేసులు పెడితే బెదిరేది లేదని, రెండేళ్లలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటనీ ఆయన ప్రశ్నించారు.

మెల్యే ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలని, లేదంటే ప్రజలు క్షమించరని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జివి రామకృష్ణారావు, సిద్ధం వేణు, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, శేఖర్ గౌడ్, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, ఏకానందం, గంప వెంకన్న, మాతంగి లక్ష్మణ్, వంతడుపుల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన రసమయి



జనత న్యూస్ బెజ్జంకి : బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి తండ్రి రిటైర్ టీచర్ చల్మారెడ్డి ఇటీవల మృతి చెందగా ఆదివారం మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ మండల పార్టీ నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింత కింది శ్రీనివాస్ గుప్తా, చేలుకల తిరుపతి రెడ్డి, రావుల రామకృష్ణారెడ్డి, ముక్కిస తిరుపతి రెడ్డి, చింతలపల్లి సంజీవరెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ముక్కిస తిరుపతి రెడ్డి, ముక్కిస రాజిరెడ్డి,దీటి రాజు, లింగాల అర్జున్, ఎలా శేఖర్ బాబు, జంగపెల్లి పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.


# వడ్ల కుప్పకు బైక్ ఢీ - దంపతులకు తీవ్ర గాయాలు



హుస్నాబాద్, జనత న్యూస్:నడిరోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పలపై బైక్ ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడిన ఘటన అక్కన్నపేట మండలం బంజారా హిల్స్ తండాలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, దూల్మిట్ట మండలం బిక్కల్ గ్రామం శివాలి తండాకు చెందిన లకావత్ రవి, లకావత్ ఉమా దంపతులు ఉదయం ఐదున్నర గంటల సమయంలో కరీంనగర్ వైపు కూలీ పనుల కోసం బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యంలో అక్కన్నపేట మండలం బంజారా హిల్స్ తండా వద్ద స్థానిక రైతులు రోడ్డుపై వడ్లను ఆరబోస్తుండగా, బైక్ వడ్ల కుప్పను ఢీకొని రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో రవి, ఉమా దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి.సంఘటన గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌ను పిలిపించి గాయపడిన వారిని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సిందిగా సూచించారు. ఈ ఘటనపై దంపతుల కుమారుడు అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రోడ్లపై వడ్లను ఆరబోసి ప్రమాదాలకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు సమాచారం.

# ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండి సతమతం అవుతున్నారా..?

## అయితే ఈ ఆహారాలను తినండి..!



అధిక ఒత్తిడి ప్రస్తుతం చాలా మందికి పెద్ద సమస్యగా మారింది. ఒత్తిడి, ఆందోళనతోపాటు డిప్రెషన్ బారిన పడి చాలా మంది మానసిక ఆరోగ్య పరంగా కుదేలవుతున్నారు. చాలా మందికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింటోంది. ఇల్లు, ఉద్యోగం, వ్యాపారం, విద్య లేదా ఆర్థిక సమస్యల కారణంగా చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడి కారణంగా అనేక వ్యాధులు సైతం వస్తున్నాయి. అందువల్ల ఒత్తిడిని తగ్గించుకోవాలని వైద్యులు సైతం సూచిస్తున్నారు. అయితే ఒత్తిడిని తగ్గించుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. చాలా మంది తమకు తెలిసిన పద్ధతులను ఫాలో అవుతుంటారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు కేవలం వ్యాయామం, హాబీలను పాటించడం మాత్రమే కాకుండా ఆహారం కూడా చాలా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల మన శరీరానికి పలు పోషకాలు లభిస్తాయి. ఇవి ఒత్తిడిని తగ్గించుకునేందుకు అద్భుతంగా పనిచేస్తాయి.

### ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు..

చేపలను వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు తింటుంటే మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి మూడ్‌ను మారుస్తాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గేలా చేస్తాయి. శరీరంలోని వాపులను సైతం తగ్గిస్తాయి. దీంతో మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. వాల్‌నట్స్, బాదంపప్పు, గుమ్మడికాయ విత్తనాలను ఆహారంలో భాగం చేసుకున్నా మేలు జరుగుతుంది. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లతోపాటు మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇవి ఒత్తిడి తగ్గేందుకు సహాయం చేస్తాయి. అలాగే పాలకూర, తోటకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలను తరచూ తింటున్నా మేలు జరుగుతుంది. వీటిల్లో ఉండే మెగ్నిషియం, ఫోలేట్ న్యూరోట్రాన్స్‌మిటర్లను ఉత్పత్తి చేస్తాయి. ఇవి మూడ్‌ను మారుస్తాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గేలా చేస్తాయి.

### బెర్రీలు, తృణ ధాన్యాలు..

బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను తింటున్నా మేలు జరుగుతుంది. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తాయి. మనస్సు ప్రశాంతంగా మారేలా చేస్తాయి. ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసోల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఓట్ మీల్, కినోవా, బ్రౌన్ రైస్‌లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. సెరటోనిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. అవకాడోల్లో ఆరోగ్యకరమైన కొవ్వులతోపాటు అనేక రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిల్లో ఉండే మెగ్నిషియం నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. మెదడు చురుగ్గా ఉండేలా చేస్తుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది.

### పెరుగు, కోడిగుడ్లు..

పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కూడా మేలు జరుగుతుంది. ఇది ప్రో బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. అందువల్ల పెరుగును తింటుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు మెదడు ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గేలా చేస్తుంది. డార్క్ చాకొలెట్‌లలో కొకొవా అధికంగా ఉంటుంది. కనుక వీటిని తింటున్నా కూడా మేలు జరుగుతుంది. డార్క్ చాకొలెట్లలో ఫ్లేవనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తాయి. దీంతో మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రోజూ ఒక కోడిగుడ్డును తినడం కూడా మెదడు ఆరోగ్యంపై పాజిటివ్ ప్రభావాన్ని చూపిస్తుంది. కోడిగుడ్లలో ట్రిప్టోఫాన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది సెరటోనిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇలా పలు రకాల ఆహారాలను తింటుంటే ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.

## సామ్ ఈజ్ బ్యాక్.. ఈసారి 80s లుక్‌లో!



స్టార్ హీరోయిన్ సమంత మళ్లీ కెమెరా ముందుకొచ్చేశారు. హెల్త్ ఇష్యూస్ కారణంగా కొంతకాలం లాంగ్ బ్రేక్ తీసుకున్న సామ్, ఇప్పుడు ఫుల్ ఎనర్జీతో సెట్స్‌పై అడుగుపెట్టారు. తన ఫ్యాన్స్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న సోలో పర్ఫార్మెన్స్ కోసం ఆమె రెడీ అయిపోయారు. 'ఖుషి' తర్వాత సమంతను మళ్లీ బిగ్ స్క్రీన్ మీద చూసేందుకు ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇప్పుడు ఆ వెయిటింగ్‌కు తెరపడింది. నిజానికి 'యశోద' (2022) తర్వాత సమంత నుంచి ఆ రేంజ్ పవర్ ప్యాక్డ్ సోలో పెర్ఫార్మెన్స్ రాలేదు. మధ్యలో 'శాకుంతలం', 'ఖుషి' చేసినా.. ఈ ఏడాది 'శుభం'లో కేవలం గెస్ట్ రోల్‌కే పరిమితం అయ్యారు. దీంతో, ఆమె ఫుల్ లెంగ్త్ సోలో హీరోయిన్‌గా ఎప్పుడు వస్తారా అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ గ్యాప్‌ను ఫిల్ చేస్తూ, సామ్ ఇప్పుడు ఏకంగా డబుల్ డ్యూటీతో బరిలోకి దిగారు. ఈసారి ఆమె కేవలం హీరోయిన్ మాత్రమే కాదు, ప్రొడ్యూసర్ కూడా. తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ఆమె స్వయంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సమంత చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచే దీనిపై మంచి బజ్ క్రియేట్ అయింది. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే, ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు రామోజీ ఫిల్మ్ సిటీలో ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. సమంతతో పాటు మిగిలిన స్టార్ కాస్ట్ పై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకు 'ఓ బేబీ' లాంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కాంబో రిపీట్ అవుతుండటంతో అంచనాలు స్కై లెవల్‌లో ఉన్నాయి. ఇదొక రెగ్యులర్ ఫ్యామిలీ డ్రామా కాదట. 1980ల బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక గ్రిప్పింగ్ క్రైమ్ థ్రిల్లర్ అని ఇండస్ట్రీ టాక్. ఈ జానర్ నందిని రెడ్డికి, సమంతకు కూడా కొత్తే. అన్నింటికంటే ముఖ్యంగా, ఈ సినిమాలో సమంత లుక్ ఇంతకు ముందు ఎవరూ చూడని విధంగా, ఆ పీరియడ్‌కు తగ్గట్టు చాలా కొత్తగా ఉండబోతోందని సమాచారం. ఒకవైపు నటిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ, మరోవైపు నిర్మాతగా బాధ్యతలు తీసుకుని సమంత ఈ సినిమాపై ఫుల్ ఫోకస్ పెట్టారు. చాలా గ్యాప్ తర్వాత వస్తున్న ఈ సోలో సినిమాతో సామ్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తారో చూడాలి.

## యష్ టాక్సిక్.. ఫ్యాన్స్ టెన్షన్‌కి మాస్ స్టఫ్ ఎప్పుడు..?



కె.జి.ఎఫ్ 2 సెన్సేషనల్ హిట్ తర్వాత యష్ టాక్సిక్ అంటూ ఒక సినిమా చేస్తున్నాడని తెలిసిందే. గీతు మోహన్ దాస్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో భారీ స్టార్ కాస్ట్ ఉంది. సినిమా గురించి అప్పట్లో ఒక గ్లింప్స్ వచ్చి అంచనాలు పెంచింది ఆ తర్వాత మేకర్స్ నుంచి ఎలాంటి అప్డేట్స్ రావట్లేదు. ఓ పక్క టాక్సిక్ పై రకరకాల వార్తలు యష్ ఫ్యాన్స్ ని టెన్షన్ లో పడేస్తుంది. డైరెక్టర్, హీరో మధ్య డిస్టన్స్ వచ్చిందని.. సినిమా అనుకున్న విధంగా అవుట్ పుట్ రావట్లేదని రకరకాల వార్తలు వస్తున్నాయి. ఐతే వీటిపై మేకర్స్ చాలా సైలెంట్ గా ఉన్నారు. ఎందుకంటే భారీ బడ్జెట్ తో వస్తున్న టాక్సిక్ పై కావాలనే ఇలాంటి నెగిటివిటీ చేస్తున్నారని వారు అంటున్నారు. సినిమా నెక్స్ట్ లెవెల్ మాస్ స్టఫ్ తో వస్తుందని యష్ ఫ్యాన్స్ అయితే మళ్లీ పండగ చేసుకుంటారని అంటున్నారు. ఐతే గీతు మోహన్ దాస్ టాక్సిక్ మొదలు పెట్టడానికి ముందే ఇలాంటి నెగిటివిటీ వస్తుందని గెస్ చేసింది. అందుకే సినిమా పూర్తయ్యే వరకు ప్రమోషన్స్ మొదలు పెట్టలేదు. సినిమా మొదలైన టైం లో గ్లింప్స్ వదిలిన చిత్ర యూనిట్ నెక్స్ట్ అప్డేట్స్ కి టైం తీసుకుంది. కియరా అద్వాని హీరోయిన్ గా నటిస్తున్న టాక్సిక్ సినిమాలో నయనతార కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తుంది. ఈ సినిమాను 2026 ఫిబ్రవరి రిలీజ్ అనుకున్నారు. కానీ సినిమా క్వాలిటీ పరంగా ది బెస్ట్ అనిపించాలని సమ్మర్ కి షిఫ్ట్ చేస్తున్నట్టు తెలుస్తుంది. K.G.F 1 అండ్ 2 సినిమాలతో పాన్ ఇండియా హిట్ అందుకున్న యష్ టాక్సిక్ పై ఈ లో బజ్ ఫ్యాన్స్ ని కాస్త టెన్ష పడేలా చేస్తున్నా వన్స్ సినిమా పూర్తై రిలీజ్ కి రెడీ అనుకున్న టైం లో భారీ ప్రమోషన్స్ చేయాలని అనుకుంటున్నారు.



## షార్ట్ ఫ్రాక్ లో కృతి అందాలు..

ఆధునిక ప్రపంచంలో సోషల్ మీడియా వాడకం ఎక్కువగా పెరిగిపోయింది.. అందుకే ఎవరికైనా పాపులారిటీ లభించాలి అంటే ఈ సోషల్ మీడియాను ఎక్కువగా సాధనంగా ఉపయోగించుకుంటున్నారు. అటు హీరోయిన్స్ గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గ్లామర్ వలకబోస్తూ రోజుకొక ఫోటో షేర్ చేస్తూ అభిమానులలో.. ఫాలోవర్స్ లో ఎక్కడలేని పాపులారిటీ దక్కించుకుంటున్నారు. ముఖ్యంగా ఇంట్లో జరిగే విషయం మొదలుకొని తమ వ్యక్తిగత జీవితంలో జరిగే విషయాల వరకు అలాగే సినిమా షూటింగ్లకు సంబంధించిన ఇలా ప్రతి విషయాన్ని కూడా అభిమానులతో పంచుకుంటున్నారు. ఒకప్పుడు హీరోయిన్స్ ని కలవాలి అంటే ఎంతో కష్టం అయ్యేది. కానీ ఇప్పుడు సోషల్ మీడియా వచ్చిన తర్వాత వారితో నేరుగా మెసేజ్లు చేస్తున్నారు. మాట్లాడుతున్నారు కూడా.. అలా సోషల్ మీడియా అందరికీ అందుబాటులోకి వచ్చేసింది.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ని పెంచుకొని సినిమాలలో అవకాశాలు కూడా అందుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రముఖ హీరోయిన్స్ ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో బిజీబిజీగా గడిపేసి ఇప్పుడు అవకాశాల కోసం మళ్లీ సోషల్ మీడియాను వాడుకుంటున్నారు. అలాంటి వారిలో కృతి శెట్టి కూడా ఒకరు అని చెప్పవచ్చు. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సనా దర్శకత్వంలో మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా వచ్చిన ఉప్పెన సినిమాతో హీరోయిన్ గా తెలుగు తెరకు పరిచయమైంది కృతి శెట్టి. మొదటి సినిమాతోనే 100 కోట్లకు క్లబ్లో చేరిపోయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ సినిమా తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు అంటూ వరుసగా హ్యాట్రిక్ విజయాలను తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమా తరువాత వరుసగా ఆఫర్లు తలుపు తట్టాయి. కానీ ఏ చిత్రం కూడా ఈమెకు విజయాన్ని అందించలేదు. అలా ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్ , మాచర్ల నియోజకవర్గం, కస్టడీ , మనమే అంటూ పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా ఆకట్టుకోలేదు. ఇదిలా ఉండగా ఈ మధ్యకాలంలో నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటున్న ఈ ముద్దుగుమ్మ ఎక్కువగా గ్లామర్ షో చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే తాజాగా మినీ ఫ్రాక్ ధరించిన ఈమె అందులో తన అందాలను చూపిస్తూ అబ్బురపరిచింది. థిక్ గ్రీన్ కలర్ ప్రింటెడ్ మినీ ఫ్రాక్ ధరించిన ఈమె తన అందాలతో మేని ఛాయ తో అందరిని ఫిదా చేసేసింది. మొత్తానికి అయితే కృతి శెట్టి తన అందాలతో మరొకసారి అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసిందని చెప్పవచ్చు. ఇక అమ్మడి అందానికి అభిమానులే కాదు నెటిజన్స్ కూడా ఫిదా అవుతూ పలు రకాల కామెంట్లు చేస్తున్నారు. కృతి శెట్టి ప్రస్తుతం ప్రదీప్ రంగనాథనాన్ తో కలిసి లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. అలాగే వా వాతియార్, పెద్ది, జెనీ, ఖలీఫా వంటి చిత్రాలలో కూడా నటిస్తోంది ఇందులో పెద్ది, ఖలీఫా వచ్చే ఏడాది విడుదల కాబోతున్నాయి. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ పైనే ఉన్నాయి. మరి ఈ సినిమా అయినా ఈమెకు సక్సెస్ అందిస్తుందేమో చూడాలి. ఈ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించారు.



## లెహంగాలో మెస్మరైజ్ చేస్తున్న రకుల్!

పంజాబీ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ తెలుగు వారికి అత్యంత ఇష్టమైన హీరోయిన్లలో ఒకరిగా మారిపోయింది. ఈ ముద్దుగుమ్మ అందాలకు ఎంతోమంది ఆకర్షితులవుతూ ఉంటారు. రకుల్ ప్రీత్ సింగ్ నటించిన చాలావరకు తెలుగు సినిమాలు హిట్ అవ్వడంతో టాలీవుడ్ లో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా సౌత్ ఇండస్ట్రీలో ఏ సినిమాలు ప్రకటించకపోయినప్పటికీ బాలీవుడ్ లో రెండు మూడు సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంది.ఈ నేపథ్యంలోనే ఈ హీరోయిన్ నటించిన తాజా మూవీ 'దే దే ప్యార్ దే -2' మూవీకి సంబంధించి తాజాగా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా తళ తళ మెరిసిపోయే లెహంగాలో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. అంతేకాదు ఆ ఫోటోల కింద దీపావళి ఇదే లాస్ట్ అని నేను హామీ ఇస్తున్నాను. కానీ ఈ ఆడియో యూస్ చేయడం చివరిది కాదు అంటూ క్యాప్షన్ ఇచ్చింది.అలాగే రాత్ బర్ పాటలో మునిగిపోయాను అంటూ రాత్ బర్ హ్యాష్ ట్యాగ్ కూడా పెట్టింది. ఇక లేటెస్ట్ ఇన్స్టా పోస్టులో రకుల్ ప్రీత్ సింగ్ జిగేలుమనే మెరిసే లెహంగాలో మరింత అందంగా కనిపిస్తోంది. స్లీవ్ లెస్ టాప్ తో నెట్టెడ్ చున్నితో పెయిరప్ చేసింది. అలాగే నెక్ చౌకర్,చెవి కమ్మలు హైలైట్ అయ్యేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ పోస్ట్ చేసిన లేటెస్ట్ ఇన్స్టా ఫొటోస్ వైరల్ గా మారడంతో పాటు ఆమె పెట్టిన హ్యాష్ ట్యాగ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. రీసెంట్ గానే రకుల్ ప్రీత్ సింగ్ నటించిన మూవీ నుండి రాత్ బర్ అనే సాంగ్ ని చిత్ర యూనిట్ రిలీజ్ చేసిన సంగతి మనకు తెలిసిందే.. దే దే ప్యార్ దే-2 మూవీ విషయానికి వస్తే.. దేదే ప్యార్ దే మూవీ కి సీక్వెల్ గా వస్తున్న దే దే ప్యార్ దే -2 మూవీ లో అజయ్ దేవగన్ హీరోగా, రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాలో అజయ్ దేవగన్ తన చిన్ననాటి స్నేహితురాలు రకుల్ ప్రీత్ సింగ్ ని పెళ్లి చేసుకోవాలి అనుకుంటారు. కానీ ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటుంది.ముఖ్యంగా రకుల్ ప్రీత్ సింగ్ తండ్రి వయసు ఎంత ఉంటుందో అజయ్ దేవగన్ వయసు అంత ఉంటుంది. అలా ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండటంతో రకుల్ తండ్రి అజయ్ దేవగన్ తో పెళ్లికి ఒప్పుకోకపోవడంతో పాటు మరో అబ్బాయిని రకుల్ ప్రీత్ సింగ్ కి ఇచ్చి పెళ్లి చేయాలి అనుకుంటారు.మరి రకుల్ ని పెళ్లి చేసుకోవడానికి ఆమె తల్లిదండ్రులను అజయ్ దేవగన్ ఏ విధంగా ఒప్పిస్తారు అనేది ఈ సినిమాలో చూడాల్సిందే.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com